ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 19 జూన్ 2025

నలుగురు జీవిత ఖైదీలు విడుదల

కడప క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న నలుగురిని విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 17 మందిని విడుదల చేశారు. అందులో నలుగురు కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ఉన్నారు. సయ్యద్ రవూఫ్ అలియాస్ రాజు (మదనపల్లె), హరిత విజయకుమార్ (కర్నూలు), పాయిని అలియాస్ పలాని (చిత్తూరు), బల్ల వసంతకుమార్ అలియాస్ వసంత (కడప)ను విడుదల చేశారు.

19 ఆశా వర్కర్ల పోస్టుల భర్తీ

● 26లోగా దరఖాస్తులు సమర్పించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ ఉషశ్రీ

రాయచోటిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 19 ఆశావర్కర్ల పోస్టుల భర్తీకి అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఉషశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్, కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఖాళీగా ఉన్న 19 ఆశావర్కర్ల పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇందులో గ్రామీణ స్థాయిలో 17 పోస్టులు, పట్టణ ప్రాంతాల్లో 2 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఆశా వర్కర్ల నియామకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సంబంధిత గ్రామంలో నివసిస్తూ పెళ్లి అయినా వారు కానీ, వితంతువులు, విడాకులు తీసుకున్న వారు భర్తతో విడిపోయి జీవిస్తున్న వారై ఉండాలన్నారు. అలాగే 25 నుంచి 45 సంవత్సరాలు వయస్సు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. విద్యార్హత కనీసం పదో తరగతి పాసై ఉండాలన్నారు. పైన తెలిపిన కనీస అర్హతలు కలిగి ఉన్న అభ్యర్థులు అన్నమయ్య ఏపీ.జీవోవి.ఇన్‌వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న దరఖాస్తు ఫారం నింపి రాయచోటి పట్టణ పరిధిలోని మాసాపేట హైస్కూల్‌లో వద్ద గల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఈనెల 26వ తేదీ లోపు సమర్పించాలని తెలిపారు.

21న ప్రపంచ యోగా దినోత్సవం

● విజయవంతంగా నిర్వహించాలి : కలెక్టర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్రలో భాగంగా ఈనెల 21న రాయచోటి, జిల్లా వ్యాప్తంగా జరిగే యోగా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి సబ్ కలెక్టర్లు, ఆర్డీవో, జిల్లా అధికారులు, స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, మండల ప్రత్యేక అధికారులు, ఆర్ఐలు, మండల సర్వేయర్లు, వీఆర్‌వోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్స్, ఎస్పీడీసీఎల్ అసిస్టెంట్స్, ఏఎన్‌యంలు తిదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి యోగాంధ్ర కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ఐదు లక్షల మందితో ప్రత్యక్షంగా రెండు కోట్ల మందితో రాష్ట్రవ్యాప్తంగా యోగా చేసి జూన్ 21న ప్రపంచ రికార్డు నెలకొల్పే విధంగా తద్వారా యోగా ప్రాముఖ్యతను ప్రజల్లోకి ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లే ఉద్దేశ్యంతో పనిచేస్తున్నదన్నారు.

ఇలా చేయాలంటే ప్రతి ఒక్కరూ ఈ యోగా కార్యక్రమంలో పాల్గొనే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఆర్డీవో, ఏడీ సర్వే, డీఎంహెచ్‌వో, వ్యవసాయశాఖ ఏడీ, జిల్లా అధికారులు, స్పెషల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో నకిలీలలు

● పాత తేదీలతో ఇంటి పట్టాలు చిటికెలో సిద్ధం

● ప్రభుత్వ లేఅవుట్లలో ఖాళీ జాగాలు మాయం

● ఉపాధిగా నకిలీ పట్టాల తయారీ

● అధికారుల తనిఖీలతో బట్టబయలు





శిబ్యాల మాజీ వీఆర్‌వో ఇంట్లో తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

రాయచోటిలో నకిలీ ఇంటి పట్టాలతో ఆక్రమణదారులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వ లేఅవుట్లలో ఖాళీ జాగా కనిపిస్తే చాలు నకిలీ ఇంటి పట్టాలతో ఆక్రమించుకుంటున్నారు. కొందరు రిటైర్డ్ రెవెన్యూ సిబ్బందికి ఈ నకిలీ పట్టాల తయారీ ఉపాధిగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. తాము సర్వీసులో ఉన్నప్పుడు తమ వద్ద ఉన్న అనేక రికార్డులను ప్రభుత్వానికి అప్పగించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ రికార్డులను అడ్డం పెట్టుకుని ఎన్ని సంవత్సరాల నాటి పట్టాలైనా లక్షల రూపాయలు ఖర్చు పెట్టుకుంటే చిటికెలో సిద్ధం చేసిస్తున్నారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటిలో ఇంటి స్థలాలకు విపరీతమైన గిరాకీ ఉంది. రాయచోటి చుట్టూ దాదాపు 18 మండలాల ప్రజలు ఇక్కడికి పనుల కోసం వలసలు వస్తుంటారు. పిల్లల చదువుల కోసమూ ఇక్కడికి వచ్చి స్థిరపడే వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. దీంతో ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా జోరుగానే జరుగుతోంది. గతంలో గుట్టలు, వంకలలో ఇంటి పట్టాలు ఇచ్చారు.

అయితే ప్రస్తుతం రాయచోటి పట్టణం విస్తరించిన నేపథ్యంలో ఖాళీ జాగాలను ఆక్రమించే వారి సంఖ్య కూడా ఎక్కువైంది. ఈ నేపథ్యంలో ఎప్పుడో 15, 20 సంవత్సరాల కిందట ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చినప్పటికీ ఆర్థిక స్థోమత లేని వాళ్లు ఇళ్లు కట్టుకోలేదు. ఇటువంటి ఖాళీ జాగాలపైన అక్రమార్కులు కన్నేశారు. ఎక్కడ ఖాళీ జాగా కనిపించినా రాత్రికి రాత్రే పునాదులు వేసేస్తున్నారు. నిజమైన పట్టాలు కలిగిన వాళ్లు వచ్చి అడిగితే తమ వద్ద ఉన్న నకిలీ పట్టాలను చూపిస్తున్నారు. దీంతో నిజమైన పట్టా కలిగిన వాళ్లు రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకుల వద్దకు పరుగులు పెడుతున్నారు.

పాత తేదీలతో పట్టాలు చిటికెలో రెడీ

కొందరు రిటైర్డ్ రెవెన్యూ సిబ్బంది ద్వారా అక్రమార్కులు పాత తేదీలతో పట్టాలు తయారు చేసుకుంటున్నారనే ఆరోపణలు జోరుగా ఉన్నాయి. ఇటీవల ఒక మహిళకు చెందిన స్థలాన్ని ఓ చోటా రాజకీయ నాయకుడి సోదరుడు ఆక్రమించాలని చూశాడు. ఇది తన స్థలమని ఆ మహిళ తన వద్ద ఉన్న ఇంటి పట్టాను చూపించింది. తన వద్ద కూడా ఇంటి పట్టా ఉందని ఆ నాయకుడి సోదరుడు ఓ పట్టా పేపర్‌ను చూపించాడు. అయితే ఆ మహిళకు ఇచ్చిన పట్టానే ముందుగా ఇచ్చినట్లు అక్కడ ఉన్న వాళ్లు గుర్తించారు. దీంతో మరుసటి రోజే ఆ నాయకుడి సోదరుడు ఆ మహిళ వద్ద ఉన్న పట్టా పేపర్ కంటే.. ముందు తేదీతో మరొక ఇంటి పట్టా పేపర్‌ను తెచ్చి చూపించాడు. తాను పునాది తీస్తానని ఎవరు అడ్డం వస్తారో చూస్తానంటూ హడావుడి చేశాడు. దీంతో అక్కడున్న వారందరూ అవాక్కయ్యారు. ఇంత సులువుగా రాయచోటిలో ఇంటి పట్టాలు పుడుతున్నాయా అని నోరెళ్లబెట్టారు. అయితే ఆ మహిళ ఈ విషయాన్ని నియోజకవర్గ ముఖ్య నాయకుడి సోదరుడి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయమని అడిగింది. ఆమె వద్ద ఉన్న పట్టాను గమనించిన ఆ ముఖ్య నాయకుడి సోదరుడు ఆమె స్థలాన్ని ఆక్రమించాలని చూస్తున్న చోటా నాయకుడి సోదరుడికి గట్టిగానే బుద్ధి చెప్పినట్లు సమాచారం. ఇలా అక్రమాలకు పాల్పడాలని చూస్తే బాగుండదని హెచ్చరించినట్లు ప్రచారంలో ఉంది.

ఆకస్మిక తనిఖీలతో బట్టబయలు

జిల్లా కేంద్రం ఏర్పడిన నాటి నుంచి రాయచోటిలో నకిలీ ఇంటి పట్టాల తాకిడి ఎక్కువైంది. ఇటీవల కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమానికి వస్తున్న ఎక్కువ మంది ఇంటి పట్టాల విషయమై ఫిర్యాదులు తెస్తున్నారు.

దీంతో సమస్య తీవ్రతను గుర్తించిన కలెక్టర్ నకిలీ పట్టాలను తయారు చేస్తున్న వారిపై కొరడా ఝుళిపించాలనుకున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల కిందట రాయచోటి పట్టణంలో రెవెన్యూ, పోలీసు అధికారులు కలిసి ప్రస్తుతం విధుల్లో ఉన్న ఓ డిప్యూటీ తహసీల్దార్ ఇంటి మీద, అతడితో సన్నిహితంగా ఉండే మరో ప్రైవేటు వ్యక్తి ఇంటి మీద, శిబ్యాలకు చెందిన రిటైర్ అయిన ఓ వీఆర్‌వో ఇళ్లల్లో తనిఖీలు చేశారు. శిబ్యాలకు చెందిన మాజీ వీఆర్‌వో ఇంట్లో మాత్రమే అధికారులకు పలు కీలక డాక్యుమెంట్లు దొరికాయి. వీటితో నకిలీ పట్టాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. అయితే గతంలో రాయచోటి మండలంలో పనిచేసిన కొందరు మాజీ వీఆర్‌వోలు ఇప్పటికీ పెద్దఎత్తున ప్రభుత్వ భూములకు చెందిన రికార్డులు తమ వద్ద ఉంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. బినామీ పేర్లతో ఎకరాలకు ఎకరాలు డీకేటీ భూములను తమ స్వాధీనంలోనే ఉంచుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటిపైనా కలెక్టర్ దృష్టి సారిస్తే బాగుంటుందని పలువురు పేర్కొంటున్నారు. ఒకే ఇంటి స్థలం విషయమై తమ వద్దకు వచ్చే ఫిర్యాదులో రెండింటిలో ఏది నిజమైనదో తేల్చి.. నకిలీ పట్టాదారునిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వైసీపీ నాయకుల బరితెగింపు

● ప్రభుత్వ పాఠశాల ఆవరణలో అర్ధరాత్రి పుట్టినరోజు వేడుకలు

● ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన



ప్రభుత్వ పాఠశాలలో పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

నందలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో అర్ధరాత్రి వైసీపీ నాయకులు పుట్టినరోజు వేడుకల పేరుతో వీరంగం సృష్టించిన సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని నాగిరెడ్డిపల్లెలో దేవాలయంతో సమానమైన పాఠశాలలు మందుబాబులకు అడ్డాగా మారాయి. రాత్రి అయితే చాలు నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో వైసీపీ యువ నాయకులు మద్యం తాగుతూ చిందులేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సోమవారం రాత్రి నాగిరెడ్డిపల్లెలోని ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాల ఆవరణంలో వైసీపీ నాయకుడు షేక్ ఖలీంఖాన్ జన్మదిన వేడుకలను వైసీపీ యువ నాయకులు అర్ధరాత్రి జరుపుకున్నారు. బైక్‌పై కేక్ పెట్టి కట్ చేయడంతో పాటు ఈలలు, కేరింతలు కొడుతూ బాణాసంచా కాల్చుతూ నానా హంగామా చేశారని స్థానికులు తెలిపారు. ఒక పార్టీకి చెందిన నాయకుడి జన్మదిన వేడుకలు పాఠశాలలో జరపడమేమిటని చుట్టుపక్కల ఉన్న ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో ఇలాంటి వికృత చేష్టలు చేస్తున్న వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు.

దేశీ వంగడాల అభివృద్ధికి కృషి

● అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో పరిశోధనలు

● రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో వంగ రకాల సేకరణ

● దేశీయ వంగడాలపై విస్తృతంగా సర్వే

6



అప్పులు తీర్చలేక రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

● వారం తర్వాత భర్త మృతి, భార్య పరిస్థితి విషమం

6

డైట్ పరిశోధనా పాఠశాలగా మోటకట్ల హైస్కూల్

● డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ బాబు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్

సంబేపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సంబేపల్లె మండలంలోని మోటకట్ల జిల్లా పరిషత్ హైస్కూల్‌ను డైట్ పరిశోధన పాఠశాలగా తీసుకుని విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంపొందిస్తున్నామని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్ బాబు తెలిపారు. బుధవారం మోటకట్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధనా విధానాలను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వినూత్న పద్ధతిలో బోధన చేయడం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఆధునిక బోధనా పద్ధతులను ఇక్కడ అమలు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో మెరుగైన అభ్యసన ఫలితాలను సాధించేందుకు డైట్ అధ్యాపక బృందం తమ సహకారాన్ని అందచేస్తారని తెలిపారు.

మోటకట్ల హైస్కూల్‌ను దత్తత తీసుకున్న మడితాటి నరసింహారెడ్డి

ఈ సందర్భంగా డైట్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ మోటకట్ల హైస్కూల్‌ను దత్తత తీసుకుంటున్నామని, ఈ పాఠశాలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తమ బోధనా విధానాలను అమలు చేస్తామని తెలిపారు. విద్యను అందించడంలో రోల్ మోడల్‌గా మోటకట్ల పాఠశాలను తీర్చిదిద్దుతామన్నారు. నాణ్యమైన విద్య కోసం పరిసర ప్రాంత తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, డైట్ అధ్యాపకులు శివభాస్కర్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు చిదంబర్‌రెడ్డి, నాగేశ్వర్‌నాయక్, భాస్కర్, టీఎస్ పద్మావతి, నరసింహులు, వేణుమాధవరాజు, ప్రసాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

తోతాపురికి మద్దతు ధర కేజీ రూ.4

● జిల్లా ఉద్యాన అధికారి సురేశ్‌బాబు



మండీ వద్ద తోతాపురి మామిడి కాయలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి సురేశ్‌బాబు

రాయచోటిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తోతాపురి జ్యూస్ మామిడి కాయలకు ప్రభుత్వం కేజీకి రూ.4 మద్దతు ధర ఇస్తోందని రాయచోటి మండల ఉద్యాన శాఖాధికారి సురేశ్‌బాబు తెలిపారు. బుధవారం ఆయన రాయచోటి మండల పరిధిలోని మాధవరంలో మామిడి మండీల వద్ద తోతాపురి మామిడి కాయల కొనుగోలును పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తోతాపురి రకానికి జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద ధర తగ్గినందున రైతులను ఆదుకునేందుకు జ్యూస్ ఫ్యాక్టరీ వారు చెల్లించే ధరకు అదనంగా ప్రభుత్వం కేజీకి రూ.4 మద్దతు ధరను ప్రకటించిందని తెలిపారు. రైతులు కాయలను అమ్మినప్పుడు అక్కడ విధుల్లో ఉన్న రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా తమ పేర్లను పర్మిట్‌లో నమోదు చేసుకుని ఫ్యాక్టరీకి తీసుకెళ్లాలన్నారు. అలాగే రైతులు నేరుగా పల్ప్, జ్యూస్ ఫ్యాక్టరీ దగ్గరికి తీసుకెళ్లినట్లయితే అక్కడ విధుల్లో ఉన్న రైతు సేవా కేంద్ర సిబ్బందికి తమ రీసెంట్ వన్‌బీ, ఆధార్, ఆధార్ లింక్డ్ బ్యాంక్ నెంబర్ ఉన్న పత్రాలను ఇచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం రైతు సేవా కేంద్ర సిబ్బందిని గానీ, ఉద్యాన అధికారులను గానీ సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సిబ్బంది ప్రసన్న, నిరంజన్‌రెడ్డి, మాధవి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణను వినియోగించుకోవాలి

● కలెక్టర్ చామకూరి శ్రీధర్



రైతులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో బుధవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల ఆధ్వర్యంలో వ్యవసాయ యాంత్రీకరణ పథకం నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు వ్యక్తిగతంగా 50 శాతం రాయితీపై వివిధ వ్యవసాయ యంత్ర పరికరాలను పంపిణీ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 2024-25కు 25,192 మంది రైతులకు 50 శాతం రాయితీతో 60.53 కోట్ల రూపాయలు రాయితీ విడుదల చేశారు. జిల్లాలోని 979 మంది చిన్న, సన్నకారు రైతులకు రూ.1,44,59,82 కోట్ల రాయితీ మంజూరు చేసింది. దీనికి సంబంధించిన మెగా చెక్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయశాఖ అందిస్తున్న యాంత్రీకరణ పథకం, కిసాన్ డ్రోన్ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, 2025-26 సంవత్సరానికి యాంత్రీకరణ పథకం త్వరలోనే మొదలవుతుందని, అన్ని రకాల యంత్ర పరికరాలను 50 శాతం రాయితీతో అందజేస్తారని, రైతులు వారి రైతు సేవా కేంద్రం ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి మజీద్‌అహ్మద్, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, పీలేరు సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

‘తల్లికి వందనం’ సాహసోపేత నిర్ణయం

● ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి



ప్రజాదర్బార్‌లో బుధవారం ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీల్లో ప్రధానమైన తల్లికి వందనం పథకం అమలు చేయడం సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి లోకేశ్‌లు తీసుకున్న సాహసోపేత నిర్ణయమని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఒకటి నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లలందరికీ తల్లికి వందనం ద్వారా ఏడాదికి రూ.15 వేలు ఇవ్వడం ప్రపంచంలో ఎక్కడా లేదని ప్రశంసించారు. దీనిని జీర్ణించుకోలేదని వైసీపీ నాయకులు బురద చల్లే కార్యక్రమాలు చేస్తున్నారని, వారి మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు.

రెండు రోజులుగా ఎమ్మెల్యే నగరిపల్లెలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి హాజరైన వారితో తల్లికి వందనం అందుతుందా లేదా అంటూ ఆరా తీస్తున్నారు. అర్హులందరికీ తప్పనిసరిగా మంజూరవుతుందని హామీ ఇచ్చారు. ప్రజా దర్బార్‌కు సమస్యలతో వస్తున్న వారితో నగరిపల్లె సందడిగా మారింది. నియోజకవర్గం నలుమూలల నుంచి వందలాదిగా ప్రజలు, పార్టీ శ్రేణులు వివిధ రకాల సమస్యలను ఆయన దృష్టికి తెచ్చి పరిష్కారం కోసం క్యూ కడుతున్నారు. వినతిపత్రాలను ఎప్పటికప్పుడు పరిష్కారం కోసం సంబంధిత అధికారులు పంపుతూ నిర్ణీత గడువులోగా ముగించాలని అధికారులను ఆదేశిస్తున్నారు. పలువురు మండల స్థాయి నాయకులు కూడా ఆయా సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరుగుతున్న ప్రజా దర్బార్‌కు వస్తున్న వారు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డి స్పందిస్తున్న తీరుతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా వెంటనే స్పందించడం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భార్యే హంతకురాలు

● గంగాధర్ హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులు

● వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణంలో సంచలనం రేకెత్తించిన రియల్టర్ గంగాధర్ హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. కేసులో ప్రధాన నిందితురాలిగా గంగాధర్ భార్య వనిత ఉందని పోలీసుల అనుమానం నిజమైంది. ఆమెను పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకుని విచారించగా హత్య కేసు చిక్కుముడి గుట్టును విప్పింది. ఈ కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మీడియాకు వెల్లడించారు. రియల్టర్ గంగాధర్ భార్య వనిత తన ప్రియుడు కొరియర్ బాయ్ రెడ్డిరామ్, ఆటో డ్రైవర్ మహేశ్, ఓ మహిళా డాక్టర్‌తో కలిసి పథకం ప్రకారం మత్తు ఇచ్చి ఆపై నిద్రలోకి జారుకున్న గంగాధర్‌ను బండరాయితో తలపై మోదీ కిరాతకంగా హత్య చేశారన్నారు. విచారణలో వాస్తవాలు బయట పెట్టడంతో హత్య కేసులో నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఘటన అనంతరం డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో తాలూకా సీఐ వెంకట్రమణ, ఎస్ఐ చంద్రమోహన్‌లు కేసు నమోదు చేసి రెండు బృందాలుగా ఏర్పడి నిందితులను పట్టుకున్నారన్నారు. మదనపల్లె పట్టణంలోని బసినికొండలో రామతులసమ్మ కల్యాణ మండపం సమీపంలో కాపురం ఉంటున్న రియల్టర్ గంగాధర్ (38) ఆదివారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడన్నారు. కట్టుకున్న భర్తను భార్య వనితనే పథకం ప్రకారం తన ప్రియుడు, మరికొందరితో కలిసి నిద్రపోతుండగా పడకలోనే హత్య చేయించిందన్నారు. కాగా పట్టుబడిన నిందితులు వనిత, కొరియర్ బాయ్ రెడ్డిరామ్, ఆటోడ్రైవర్ మహేశ్‌తో పాటు డాక్టర్‌లను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ముగ్గురు నిందితులను కోర్టులో హాజరు పరచగా మరొకరిని విచారిస్తున్నట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు.

దేశీ వంగడాల అభివృద్ధికి కృషి

- అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో పరిశోధనలు
- దేశీ వంగడాలపై విస్తృతంగా సర్వే
- రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో వంగ రకాల సేకరణ
- ప్రజాదరణ పొందిన రకాల గుర్తింపు

రైల్వేకోడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పీహెచ్‌డీ విద్యార్థులు, శాస్త్రవేత్తలు రాష్ట్రంలోని యాగంటి పల్లె, చమ్మిడిపాళెం, మదనపల్లె, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో వంకాయ రకాలపై విస్తృతంగా సర్వే చేశారు. పోలూరు లోకల్, శ్రీకాళహస్తి లోకల్, రాయదుర్గం లోకల్ వంటి ప్రజాదరణ పొందిన రకాలను గుర్తించారు. ఈ రకాల వంకాయలు ప్రాం తీయంగా చాలా కాలంగా సాగులో ఉన్నవి మాత్ర మే కాకుండా, తేలిక పాటి రుచి, మంచి వాసన, పం ట నాణ్యత, ఆకర్షణీయమైన గుణాలతో స్థానికంగా ఆదరణ పొందాయి. ఈ రకాలు మంచి దిగుబడి ఇస్తున్నా, కుళ్ల తెగులును తట్టుకునే శక్తి లేకపోవడం పరిశోధనల్లో గుర్తించారు. ఈ తెగులు కారణంగా దిగుబడి తగ్గిపోతుందని తెలుసుకున్నారు. రాయలసీమ ప్రాంతంలో ఈ వంకాయ రకాల సాగు విస్తృతి, ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఈ రకాల సం రక్షణ, బ్యాక్టీరియా కుళు ను తట్టుకునే నూతన వంగడాలను అభివృద్ధి చేసేందుకు పరిశోధనలు చేస్తున్నారు. ఉద్యాన కళాశాల పీహెచ్‌డీ విద్యార్థి వి. వినయ్‌కుమార్, పెట్లూరు చీనీ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ పి. శ్యాంసుందర్ రెడ్డి, ఉద్యాన కళాశాల ఆచార్యులు డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, డాక్టర్ బి. హరివరప్రసాద్, డాక్టర్ కే. దినేష్ ఈ పరిశోధనల్లో పాల్గొంటున్నారు. భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి సాగుచేసిన కూరగాయల్లో వంగ ప్రధానమైంది. ఫ్రాన్స్, ఇటలీ, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో కూడా ఈ పంటను అక్కడి రైతులు పండిస్తున్నారు. మన దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఎన్నో రకాల వంగ రకాలు పండిస్తున్నారు. ఒరిస్సా, బీహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వంగ విస్తారంగా పండిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రాల్లో వంగ సాగు విస్తీర్ణంలో 5వ స్థానంలో, ఉత్పత్తిలో 6వ స్థానంలో ఉంది. ఉత్పాదకతలో 3వ స్థానంలో ఉంది. కోస్తా ఆంధ్రలో పశ్చిమగోదావరి, విశాఖపట్నం, గుంటూరు, రాయలసీమలో చిత్తూరు, కర్నూలు, తెలంగాణాలో రంగారెడ్డి జిల్లాల్లో వంగ ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

దేశీ వంగ వంగడాలపై అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థులు ముమ్మరంగా పరిశోధనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా సర్వే చేశారు. ప్రజాదరణ పొందిన వంగ రకాలను గుర్తించి, సేకరించారు. చీడపీడలు ఆశించని అధిక దిగుబడినిచ్చే రకాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు


ఉద్యాన కళాశాల విద్యార్థులు సేకరించిన దేశీ రకాల వంకాయలు

సాగులో సమస్యలు

అధిక దిగుబడినిచ్చే మేలు రకాలు, సంకరజాతి విత్తనం కావాల్సినంత మేర రైతులకు లభ్యం కావడం లేదు. వినియోగదారుల అభిరుచికి తగిన రకాలు, చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలు సరసమైన ధరలో రైతులకు అందుబాటులో ఉండడం లేదు. వెర్రి తెగులును తట్టుకుని అధిక దిగుబడినిచ్చే వంగడాలు అందుబాటులో లేవు. ఇన్ని సమస్యలున్నా అన్ని రుతువుల్లో సాగు చేయడానికి వీలు ఉండడం. బెట్టను తట్టుకోవడం, అంతర సేద్యం, కలుపు నివారణ తేలికగా ఉండడం వంగ సాగుపై ఆసక్తి చూపడానికి కారణమవుతోంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర రానప్పుడు చెట్టును వదలి లాభసాటి ధరలున్నప్పుడు కార్శీ పంట (రటూన్ పంట) తీసుకోవడానికి అవకాశముంటుంది. దూర ప్రాంతాలకు రవాణా చేసేందుకు అనుకూలంగా ఉంటుంది.


ఉద్యాన పరిశోధన స్థానంలో వంగ మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

వంగ రకాలు

ప్రాంతీయ మార్కెట్లో వినియోగదారుల అభిరుచిని బట్టి రకాలు ఎంపిక చేసుకోవాలి. మన రాష్ట్రంలో గులాబి, పూసాక్రాంతి, పూసా పర్పుల్ క్లస్టర్, శ్యామల, భాగ్యవతి రకాలు అనుకూలం. సంకరజాతి రకాలలో ఊదారంగు గుండ్రటి రకాలు ఉన్నాయి. వీటిలో ఆర్క నవనీత్, పూసా హైబ్రీడ్-6, మహికో హైబ్రీడ్ నెం.254, ఉత్కర్ష మోహిన, అగోరా, మంజు, సంజు, ముమ్యామ్యా ఊదారంగు గుత్తి రకాలు మహికో, రవయ్య, మహికో నెం.3 రకాలు ఉన్నాయి. రాయలసీమ ప్రాంతంలో ఎక్కువగా అర్కా కుసుమాకర్, దేశవాళీ పచ్చ వంగ రకాలు, రాయదుర్గం, పోలూరు రకాలను పండిస్తున్నారు.

అనంతరాజుపేటలో 40 రకాల వంగడాలు

అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణలో 40 రకాల వంగ రకాలపై పరిశోధనలు చేస్తున్నారు. కళాశాల విద్యార్థులు కొంగొత్త వంగడాలపై ముమ్మరంగా పరిశీలించి పరిశోధనలు చేసి తెగుళ్లను తట్టుకునేందుకు వీలుగా ఉండే వంగడాల ఉత్పత్తికి పరిశోధనలు చేస్తున్నారు.

తెగుళ్లను తట్టుకునే వంగడాలు



అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణలో 40 రకాల వంగ వంగడాలపై పరిశోధనలు చేస్తున్నాం. తెగుళ్లను తట్టుకునే వంగడాలను ఎంచుకుంటున్నాం. ప్రధానంగా పోలూరు, శ్రీకాళహస్తి తదితరాలను పరిశీలిస్తున్నాం.. తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి ఇచ్చే వంగడాల ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నాం.

\- వి. వినయ్‌కుమార్, పీహెచ్‌డీ విద్యార్థి

మంచి వంగడాలను ఎంచుకోవాలి



రైతులు మంచి వంగ వంగడాలను ఎంచుకోవాలి. తెగుళ్లను తట్టుకునే రకాలను రైతులకు ఇవ్వడానికి పరిశోధన స్థానాలు కృషి చేస్తున్నాయి. నాణ్యమైన విత్తనాలతోపాటు, యాజమాన్య పద్ధతులను సక్రమంగా పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి. పరిశోధనలు వేగవంతం చేస్తున్నాం.

\- పి. శ్యాంసుందర్‌రెడ్డి,
పెట్లూరు పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్

కొత్త వంగడాలపై పరిశోధనలు



ఉద్యాన విద్యార్థులతో కొత్త వంగడాలపై పరిశోధనలు చేయిస్తున్నాం. రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. పరిశోధనల్లో లోటుపాట్లను పర్యవేక్షిస్తున్నాం. కూరగాయల సాగు విధానంలో విప్లవాత్మక మార్పులపై రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

\- సయ్యద్ సదరున్నీసా,
ఉద్యాన కళాశాల ప్రొఫెసర్

వాతావరణం, యాజమాన్య పద్ధతులు

వంగ ఉష్ణ మండలపు పంట. అధిక ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడిని చాలా వరకు తట్టుకోగలదు. కొండ ప్రాంతాలు, చల్లటి వాతావరణంలో మొక్క పెరుగుదల తగ్గుతుంది. అధిక చలి, మంచును తట్టుకోలేదు. బాగా నీరు ఇంకే నేలలు, ఒక మాదిరి నుంచి హెచ్చు సారవంతమైన నేలలు ఈ పంట సాగుకు అనుకూలమైనది. చౌడు భూములు పనికిరావు. నేలను 4-5 సార్లు బాగా దున్ని చదును చేయాలి. వర్షాకాలపు పంటకు బోదెలు, కాలువలు, ఏర్పాటు చేయాలి. శీతాకాలపు, వేసవి 4-5 చదరపు మీటర్ల మళ్లను తయారు చేసుకోవాలి. రకాలను బట్టి బోదెలను 75 సెంటీమీటర్లు లేదా 50 సెంటీమీటర్ల దూరంలో ఉండేలా తయారు చేసుకోవాలి. పొలంలో నాటి ముందు బాగా పారించి 30-35 రోజుల వయసు గల నారును బోదెలపై నాటుకోవాలి. నాటిన వారం రోజుల మొక్కలు చనిపోయి ఖాళీగా ఉన్న పాదులలో పై నాట్లు వేయాలి. వర్షాకాలపు పంటను జూన్-జూలైలో, శీతాకాలపు పంటను అక్టోబర్-నవంబరు మాసాల్లో, వేసవి పంటను జనవరి, రెండో పక్షం నుంచి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు నారు కోసం విత్తవచ్చు. నారు పోసిన 30 నుంచి 35 రోజుల్లో నాటుకోవాలి.

సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి

పెద్దతిప్పసముద్రం జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి సూచించారు. స్థానిక కల్యాణ మండపంలో వినియోగ దా రులు, ట్రాన్స్‌కో సిబ్బందికి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించి, సోలార్ విద్యుత్ వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. థర్మల్ విద్యుత్ వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరిగే అవకాశం ఉందని, అందుకే కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టిసారించిందన్నారు. సోలార్ విద్యుత్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు బ్యాంకులు విరివిగా రుణాలు ఇస్తున్నాయన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా గృహ వినియోగదారులకు ఒక కిలో వాట్‌కు రూ 30,000, రెండు కిలో వాట్లకు రూ. 80,000, మూడు కిలో వాట్లకు రూ. 78,000 చొప్పున కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నదని, ప్రజలు తమ విద్యుత్ చార్జీలను ఆదా చేసుకోవడానికి ఇంటిపై సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో విద్యుత్ వినియోగంతో పాటు, 70 శాతం విద్యుత్ బిల్లు కూడా తగ్గుతుందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ విషయాలను, బ్యాంకుల ద్వారా, అందుబాటులో ఉన్న రుణాల విషయం ప్రజలకు వివరించాలన్నారు. సోలార్ రూఫ్‌టాప్ అమర్చుకునేందుకు సహకారం అందించాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దతిప్పసముద్రం ఏఈ గిరిధర్, లైన్ ఇన్‌స్పెక్టర్ కందుకూరి రమణ, జూనియర్ లైన్‌మన్ రమణ, మడుమూరు లైన్ ఇన్‌స్పెక్టర్ పాపన్న, టి.సదుం లైన్‌మన్ వెంకటరెడ్డి, ఏఎల్‌ఎం, పి. మంజునాథ్, సబ్‌స్టేషన్ సిబ్బంది పాండురంగయ్య, వెంకటరామయ్య, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చలేక.. రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

- వారం తర్వాత భర్త మృతి, భార్య పరిస్థితి విషమం


నాగేంద్రరెడ్డి మృతదేహం

సిద్దవటం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు దంపతులు ఆత్మహత్యకు యత్నించారు. వీరు ఈనెల 10న తిరుపతిలోని ఓ లాడ్జిలో పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం భర్త నాగేంద్రరెడ్డి (35) మృతి చెందగా.. ప్రాణాపాయ స్థితిలో పుష్పవేణి చికిత్స పొందుతున్నారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. సిద్దవటం మండలం డేగనవాండ్లపల్లెకు చెందిన నిమ్మకాయల నాగేంద్ర రెడ్డికి కొంత పొలం ఉంది. వీరికి 8, 6 ఏళ్ల వయసున్న ఇద్దరు పిల్లలున్నారు. పంటల సాగుకు అధిక వడ్డీలకు లక్షలాది రూపాయలు అప్పులు చేశారు. వ్యవసాయం కలిసిరాక పోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక సతమతమయ్యారు. ఈ క్రమంలో చనిపోవాలని భావించారు. కుమారుడు అమరనాథ రెడ్డి, కూతురు లావణ్యను తన తల్లిదండ్రులు మునిరెడ్డి, పార్వతమ్మ వద్ద వదిలి.. తాము తిరుమలకు వెళ్లొస్తామని చెప్పారు. ఈ నెల 9న తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. మరుసటి రోజు పురుగుల మందు తీసుకుని ఆత్మహత్యకు యత్నించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఈస్ట్ పోలీసులకు లాడ్జి మేనేజర్ సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పోలీసులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేంద్రరెడ్డి బుధవారం మృతి చెందాడు. పుష్పవేణి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఈస్ట్ సీఐ కేసు నమోదు చేశారు. భార్యాభర్తలు విషం తీసుకోవడం వెనుక కారణాలు, ఎవరెవరి వద్ద అప్పులు చేశారు? ఎందుకు చేశారు? డబ్బుకోసం ఎవరైనా వేధింపులకు గురి చేశారా అనే కోణాల్లో విచారణ చేస్తున్నామని సీఐ చెప్పారు.

తాగునీటి పైపులైన్‌కు సబ్సిడీ పైపులు!?

నిమ్మనపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. గతంలో వైసీపీ నేతలు ఇసుక, శాండ్, క్వారీలను ఇష్టారాజ్యంగా దండుకోవడమే కాకుండా, ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు సబ్సిడీ ద్వారా మంజూరైన పనిముట్లను కూడా వదల్లేదు. కొండయ్యగారిపల్లి పంచాయతీ ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పంచాయతీ సర్పంచ్ వరలక్ష్మి భర్త శశిధర్‌రెడ్డి మిట్టమీదవారిపల్లిలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశాడు. ఇందుకోసం వాటర్‌షెడ్ పరిధిలోని రైతులకు ప్రభుత్వం సబ్సిడీ పై మంజూరు చేసిన పైపులను వినియోగించాడు. ఆ పైపులు నాసిరకంగా ఉండడంతో రాళ్ల పడితే పగిలి పోయే పరిస్థితి.
వెంకోజిగారిపల్లిలో మురుగుకాలువలు బాగానే ఉన్నా, వాటిపై మళ్లీ ఎత్తుగా గోడ కట్టి బిల్లు లు చేసుకునేందుకు పథకం రూపొందించారు. దీనినిబట్టి పంచాయతీలో ఏమేర అవినీతి జరుగుతోందో అర్థమవుతోంది. వైసీపీ ప్రభుత్వంలో వాటర్‌షెడ్ కింద మూడు పంచాయతీలు ఎంపికయ్యాయి. ఇలాంటి గ్రామాలకు ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, పైపు లు, టార్పాలిన్ పట్టలు, చాఫ్ కట్టర్లు వంటివి మంజూరు చేస్తుంది. భూముల్లో నీరు నిల్వ చేసేందుకు కట్టలు, కుంటలు వంటి పనులు చేసుకునేందుకు నిధులు మంజూరు చేస్తుంది. కొండయ్యగారిపల్లి పంచాయతీలో రైతుల నుంచి పాస్ పుస్తకాలు సేకరించి వారికి తెలియకుండా వాటర్‌షెడ్ ద్వారా వచ్చే పనిముట్లను కాజేశారు. వాటర్‌షెడ్ పనులు చేయకనే కట్టలు వేసినట్లు బిల్లులు చేసుకున్నారు. ఇప్పుడు కూడా స్టోర్ డీలర్‌గా ఉంటూ, ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నాడు. ఇంత జరుగతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం గమనార్హం. తాగునీటి పైపులైన్‌కు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన పైపులు అమర్చడంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్ చక్రవర్తిని వివరణ కోరగా అయన స్పందించ లేదు. కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మిట్టమీదవారిపల్లిలో ఏర్పాటు చేసిన పైపులైన్ (పక్కన)
పైపులైన్‌కు వాడిన సబ్సిడీ పైపులు (పైన)

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్

చిన్నమండెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై గ్రామీణులకు అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) వెంకటమోహన్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏపీసీఎన్ఎఫ్ క్యాండర్లు యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్‌పీలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయం ప్రగతిపై రివ్యూ చేశారు. ముఖ్యంగా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానాన్ని ప్రతి రైతు అమలు చేయాలని పిలుపునిచ్చారు. మామిడి తోటల్లో 30 రకాల విత్తనాలను కలిపి విత్తడం వలన నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడమే కాకుండా జీవవైవిధ్యాన్ని పెంచడంలో సహాయపడుతుందన్నారు. వేరుశనగ పైరులో అంతర పంటలుగా కందులు, అలసందలు, అనప, ఆముదం, జీవవైవిధ్య పంటల గురించి తెలిపారు. ఇవి వర్షాభావ పరిస్థితిలో వేరుశనగ దిగుబడి రాకపోయినా అంతర పంటల ద్వారా అదనపు ఆదాయాన్ని రైతులకు అందిస్తాయని, ప్రధాన పంటకు తెగుళ్ల రాకుండా అరికడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఎంటీఎల్ చందురెడ్డి, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసులు, పద్మావతి, ఇంటర్న్ యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్‌పీ పాల్గొన్నారు


ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న వెంకటమోహన్

విద్యార్థుల సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

- 32 వేల మంది 'తల్లికి వందనం' లబ్ధిదారులకు రూ.48 కోట్ల పంపిణీ
- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో నియోజకవర్గంలోని 32 వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో పాటు, అదనంగా మరిన్ని పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం పెడుతోందన్నారు. విదేశీ విద్యకు ప్రతి విద్యార్థికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందిస్తోందన్నారు. డీఈవో సుబ్రమణ్యం మాట్లాడుతూ తల్లికి వందనం అందని అర్హులైన వారందరికీ తప్పక ఈ పథకం అందేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం ఈ పథకంలో లబ్ధి పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే చెక్కు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీవైఈవో లోకేశ్వరరెడ్డి, ఎంఈవోలు ప్రభాకర్ రెడ్డి, రాజగోపాల్, పద్మావతి, హేమలత, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, జనసేన రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్ దారం అనిత, టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, నాదెళ్ల శివన్న, నీలకంఠ, సుద్దిళ్ల సుధాకర్, మహ్మద్‌ఖాన్, బాబాఫకృద్దీన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, విద్యార్థినులు

హార్సిలీహిల్స్‌లో నేడు మెగా 'యోగాంధ్ర'

- హాజరు కానున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

బి.కొత్తకోట, జూన్18 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు మండల పరిధిలోని హార్సిలీహిల్స్‌లో మెగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ బాబాజాన్, ఎంపీడీవో కృష్ణవేణి, నగర పంచాయతీ కమిషనర్‌లు చేపట్టారు. గవర్నర్ బంగ్లా ముందుభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో వేదిక ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి 1000 మందికి పైగా రప్పించేలా ఏర్పాట్లు చేశారు. వెలుగు మహిళలు, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది తరలింపు కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 6 గంటలకే యోగా ప్రారంభించేలా చూడాలని కలెక్టర్ మండల అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. జేసీ ఆదర్శరాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తో పాటు పలువురు జిల్లా, మండల అధికారులు హిల్స్‌కు రానున్నారు. బాధ్యతలు అప్పగించిన అధికారులు బుధవారం రాత్రికే హిల్స్‌కు చేరుకొని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్ ఎంపిక


ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

మదనపల్లె టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలో భాగంగా మదనపల్లెలో జట్టు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. బుధవారం స్థానిక మిషన్ కాంపౌండ్ మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జట్టు సభ్యుల ఎంపిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 మంది క్రీడాకారులు ఈ ఎంపికకు హాజరు కాగా వీరిలో 30 మందిని ఎంపిక చేసి, శిక్షణ శిబిరం నిర్వహిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. శిక్షణ తరువాత తుది జట్టును ఎంపిక చేసి, ఈనెల 29, 30 తేదీల్లో మదనపల్లెలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిక కమిటీ సభ్యులు జాన్ కమలేశ్, అభిలాష్, బాలాజి పాల్గొన్నారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

లక్కిరెడ్డిపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల నేపథ్యం ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్‌ఐ రవీంద్రబాబు తెలిపారు. చాగలగుట్టపల్లికి చెందిన రామాంజనేయులు(38) భార్య పిల్లలతో కలిసి బెంగుళూరులో నివసిస్తుంటాడు. వారం రోజుల క్రితం కుటుంబంతో కలసి స్వగ్రామానికి వచ్చాడు. ఈ మధ్య కాలంలో భార్య తనతో మాట్లాడడం లేదని మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం రాత్రి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు రాయచోటిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అడవి పందులను చంపినందుకు ఇద్దరి అరెస్టు


నిందితులతో ఫారెస్టు అధికారులు

సుండుపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అడవి పందులను చంపి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్లు రేంజర్‌రాయచోటి వైపు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్లు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సానిపాయి బీట్‌లోని ఎర్రచేను ప్రాంతంలో నక్క నాగరాజు, జగన్నాథం బాలు కలసి రెండు అడవి పం దులను వేటాడారు. వాటిని సంచిలో మూటగట్టుకుని ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాం డుకు తరలించినట్లు తెలిపారు. సానిపాయి, జాండ్రపేట, ఎఫ్‌బీవోలు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకును తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు


కొడుకును తల్లికి అప్పగిస్తున్న ఎస్‌ఐ

సిద్దవటం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా ఆచూకీ లేకుండా పోయిన యువకుడిని గుర్తించి మంగళవారం వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. బుధవారం పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సిద్దవటం మండలం డేగనవాండ్లపల్లెకు చెందిన కంచర్ల నవీన్‌కుమార్‌రెడ్డి బీటెక్ చదివాడు. ఉద్యోగం కోసమని మూడేళ్ల క్రితం హైదరాబాదుకు వెళ్లాడు. గ్రూప్ కోచింగ్ కూడా తీసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో తల్లిండ్రులకు ముఖం చూపించలేక అక్కడే క్యాంటీన్‌లో ఎ, సినిమా ఫీల్డ్‌లో వర్కర్‌గా పనిచేసేవాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులకు కనీసం ఫోన్ కూడా చేయలేదు. దీంతో తల్లి కంచర్ల తులశమ్మ, తండ్రి రామసుబ్బారెడ్డి నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 14న పోలీసులు హైదరాబాదులో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు నవీన్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని ఈ నెల 17న స్థానిక పోలీసుస్టేషన్‌లో తల్లి దండ్రులకు అప్పజెప్పామని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారని ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

గుమ్మసముద్రం సచివాలయంలో ఘర్షణ

- ముగ్గురికి గాయాలు
- డిజిటల్ అసిస్టెంట్ పై కేసు నమోదు



గాయపడిన గ్రామస్తులు, వాగ్వాదం చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

బి.కొత్తకోట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాల్సిన ఓ ఉద్యోగి విచక్షణ కోల్పోయి గ్రామస్తులతో ఘర్షణ పడ్డాడు. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలి పిన వివరాల మేరకు పంచాయతీ పరిధిలోని గండువారిపల్లెకు చెందిన శంకర బుధవారం తన భార్యతో కలిసి సచివాలయానికి వచ్చాడు. తమ పిల్లలకు తల్లికి వందనం నిధులు పడలేదని, ఎందుకు పడలేదో చూడాలని డిజిటల్ అసిస్టెంట్ బాబా పక్రుద్దీన్‌ను అడిగాడు. అయితే, సరైన సమాధానం చెప్పకపోగా, దురుసుగా బదులిచ్చాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం ప్రారంభమైంది. మాటామాటా పెరగటంతో బాబాపక్రుద్దీన్ తనకు అందుబాటులో వున్న వస్తువుతో దాడి చేయడంతో శంకర, అన్న నాగ భూషణం గాయపడ్డారు. ఘటనలో డిజిటల్ అసి స్టెంట్‌కు సైతం స్వల్ప గాయాలవడంతో పాటు దుస్తులు చిరిగిపోయా యి. తాము తల్లికివందనం నిధు లు పడినాయా అని అడిగితే డిజిటల్ అసిస్టెంట్ తమపై దాడి చేసి గాయపరిచాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన వారిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

లక్కిరెడ్డిపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూడిదగుంటపల్లెకు చెందిన సుబ్బగారి రామాంజనేయులు (38) అనే రైతు అప్పుల బాధ తాళలేక బుధవారం పొలం వద్ద ఉన్న షెడ్డులోని రాడ్‌కు ఉరి వేసుకొని మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.
మృతుడు రామాంజనేయులు పంటలు సాగు చేసేవాడని వేరుశనగ, మామిడిలో నష్టాలు రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అన్నదాత.. సుఖీభవ..!

● ఈనెల 20లోపు అవకాశం ● రైతన్నా స్పందించు.. ఈకేవైసీ చేయించు.. ● కసరత్తు చేస్తున్న వ్యవసాయ యంత్రాంగం



రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ చేయించుకుంటున్న రైతులు

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సాగులో పెట్టుబడి ఖర్చుల తగ్గింపు, పంటల విక్రయం సులభతరం చేయడంతో పాటు రైతులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకాన్ని తీసుకొచ్చింది. అర్హులైన రైతులకు ఏడాదికి సాగు ఖర్చులకు రూ.20 వేలు ఆర్థికసాయం అందిస్తుంది. ఈనెల 20వ తేదీ తర్వాత ఈ పథకం అమలుకు కసరత్తు చేస్తోంది. మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని నిర్ణయించింది.

ఈకేవైసీ ఇలా..

తొలకరి వానలు పలుకరిస్తున్నాయి. రైతులు ఏరువాక పనులకు సన్నద్ధమవుతున్నారు, ఖరీఫ్ కోసం పొలాలను సిద్ధం చేస్తున్నారు. సూపర్-6 పథకాలు అమలులో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం సమాయత్తం అయింది. ఈకేవైసీ చేయించుకునేందుకు క్షేత్రస్థాయిలో వివరాలను పూర్తి చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రొద్దుటూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 21,293 మంది రైతులు ఉన్నారు. వీరిలో ప్రొద్దుటూరు మండలంలో 3,940 మంది రైతులకు 3,807 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోగా 133 మంది మిగిలి ఉన్నారు. జమ్మలమడుగు మండలంలో 4292 మందికి 4163 మంది చేయించుకోగా 129 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. మైలవరం మండలంలో 5861 మందికి గాను 5756 మంది చేయించుకోగా 105 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. పెద్దముడియం మండలంలో 7191 మందికి 7011 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోగా 180 మంది ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది.

రైతులకు ఊరట

ఈ నెల 20 లోగా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలి. గడువు తక్కువగా ఉండడంతో ఈ ప్రక్రియ కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలను అనుసంధానం చేస్తూ ఊరట కల్పించింది ప్రభుత్వం. రైతులందరు రైతు సేవా కేంద్రాలకు వచ్చి ఈకేవైసీ నమోదు చేయించుకోవాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వద్ద వివరాలు లేని రైతులు మాత్రమే వేలిముద్రలు వేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు వారి జాబితాలను రైతు సేవా కేంద్రాలకు పంపించింది. దీంతో అర్హుల గుర్తింపు సులభతరం అయింది. వీరందరు ఈకేవైసీ చేయించాలని ఆదేశించింది.



ఇలా తెలుసుకోవచ్చు..

రైతులు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ అన్నదాత సుఖీభవ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో క్లిక్ చేస్తే పేజీ తెరచుకుంటుంది. ఇందులో యువర్ స్టేటస్ అని కనపడుతుంది. దానిపై క్లిక్ చేస్తే ఆధార్ నంబరు అడుగుతుంది. ఆధార్ సంఖ్యను నమోదు చేసి పక్కనున్న క్యాప్చర్ ఎంటర్ చేసి సెర్చ్ నొక్కితే రైతు పేరు, పొలం ఉన్న గ్రామం పేరు, చివరిలో ఏఎంవో ఆమోదం (అప్రూవల్డ్) అని కనిపిస్తుంది. ఇలా రైతుకు సంబంధించిన వివరాలు కనిపిస్తే పథకానికి అర్హత పొందినట్లు అని అధికారులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రైతులు సులభంగా పథకంలో అర్హత ఉందో లేదో తెలుసుకుంటున్నారు. పేరు లేకపోతే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి కారణాలు తెలుసుకోవచ్చునని సూచించారు.

21న తొలి విడత

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20 వేలు చొప్పున ఆర్థికసాయం అందిస్తామని సూపర్-6లో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనికి అనుగుణంగా అర్హులైన కుటుంబాలకు మూడు విడతల్లో సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈనెల 21వ తేదీన తొలివిడతగా రైతుల ఖాతాల్లో రూ.7వేలు జమ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు ప్రకటించారు.

ప్రక్రియ పూర్తి చేస్తాం..



అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ చేయించుకోని రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఈకేవైసీ చేయించుకోని రైతులు తక్కువ మంది ఉన్నారు. రైతులకు సర్కారు ఊరటనిస్తూ వివిధ పథకాల్లోని ఈకేవైసీ జాబితాను సుఖీభవ అర్హులతో అనుసందానించేందుకు ప్రక్రియ సులభతరం చేసింది. అర్హులైన వారికి సాయం అందేలా ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది.

- పి.సురేష్‌రెడ్డి, ఏడీఏ, ప్రొద్దుటూరు డివిజన్

గండికోట పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

జమ్మలమడుగు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక మ్యాపులో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గండికోట పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తుండగా .. ఒబేరాయ్ సంస్థ ఆతిథ్య సేవల కోసం సిద్ధమవుతోందని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం గండికోట పర్యాటక కేంద్రంలో యోగాంధ్ర కార్యక్రమానికి హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు కలిసి సుప్రసిద్ధ ఒబేరాయ్ హోటల్ నిర్మాణానికి సంబంధించిన స్థలాలను పరిశీలించారు. అనంతరం సమీపంలోని మైలవరం బోటింగ్ పాయింట్‌ను, అక్కడకు వెళ్లే మార్గాన్ని ఎమ్మెల్యే ఆదితో కలిసి పరిశీలించి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాచుర్యం పొందిన గండికోట పర్యాటక కేంద్రం భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక రంగాన్ని శాశిస్తోందనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఆదిశగా ఇప్పటికే గండికోట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. మరోవైపు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తూ అధునాతన, విలాసవంతమైన సదుపాయాలతో స్టాల్‌హోటళ్ల సముదాయాన్ని ఏర్పాటు చేసేందుకు ఒబేరాయ్ సంస్థ ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఒబేరాయ్ హోటల్స్ ఏర్పాటులో భాగంగా ఆ సంస్థ చేపట్టే నిర్మాణాల వివరాలు, మౌలిక సదుపాయాలు అయిన రోడ్లు, హెలిప్యాడ్, రిస్టార్ట్ భవనాలను నిర్మించనున్నారన్నారు. అనంతరం కలెక్టర్, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, జిల్లా టూరిజం అధికారి సురేష్‌కుమార్, సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● ఇంటింటా ప్రచారంలో ఉపాధ్యాయులు



ఇంటింటా ప్రచారంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చాలని కడప శివారులోని రాజీవ్ గృహకల్పలోని (21వ వార్డు) నగరపాలక మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. బుదవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులోచనరాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎస్వీ ప్రసాదరెడ్డి, లక్ష్మినారాణమ్మ, జె.ఆనందకుమార్, టి.సత్యనారాయణ, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ సల్మాన్‌ఖాన్, సిబ్బంది విజయ కలిసి ఇంటింటికి వెళ్లి విద్య ఆవశ్యకతను వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగు, యూనిఫాం, బెల్ట్, షూ, సాక్సులు, మధ్యాహ్నం పౌష్టికాహారం ప్రభుత్వం పిల్లలకు అందిస్తోందని అవగాహన కల్పిచారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థి అమ్మ అకౌంట్‌లో తల్లికి వందనంపేరుతో ప్రభుత్వం రూ.15వేలు జమచేస్తోందన్నారు. అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు

ప్రొద్దుటూరు, ప్రొద్దుటూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్, సిద్దారెడ్డిలను వీఆర్‌కు ఆదేశిస్తూ బుధవారం ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని రూరల్ సీఐ బాలమద్దిలేటి తెలిపారు. ఇటీవల లక్ష్మి నరసింహ అనే క్రికెట్ బుకీ తన వద్ద వీరు మామూళ్ల రూపంలో నగదును వసూలు చేసి ఆపై వేధించారని సోషల్ మీడియా వేదికగా వీడియో కూడా విడుదల చేశాడు. ఈక్రమంలో వీరిపై అవినీతి ఆరోపణలు రావడం తో ఈమేరకు ఉన్నతాధికారుల చర్యలు తీసుకున్నారు. వీరిలో రాజ్‌కు మార్ ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యి వీఆర్‌కు వెళ్లగా, సిద్దారెడ్డి ప్రస్తు తం విశాఖపట్నంలోని ప్రదానమంత్రి పర్యటన నేపథ్యంలో బందో బస్తు విధులకు వెళ్లారు. అక్కడి నుంచి రాగానే జిల్లా ఎస్పీ కార్యా లయంలో హాజరుకానున్నారని ఆయన వివరించారు.

క్రిష్టంపల్లె పాఠశాల అభివృద్ధికి కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్

పోరుమామిళ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్టంపల్లె పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షంషుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన ఆ పాఠశాలను పరిశీలించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సన్నబియ్యం వచ్చాక తేడాను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పాఠశాలను హైస్కూలుగా మార్చడానికి ఎందుకు ప్రపోజల్ పంపలేదని అడిగారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఈ పాఠశాలను దత్తతగా తీసుకుంటానని, ఇప్పటి నుంచి ఇది మనందరి పాఠశాల అని, అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులు కూడా తమ వంతు సహాయం చేసి భాగస్వాములు కావాలన్నారు.

డ్వాక్రా మహిళల అభివృద్ధే లక్ష్యం



డ్వాక్రా సంఘ సభ్యులతో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టరు

వల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): డ్రాక్వా గ్రూపులోని ప్రతి మహిళ తమ కాళ్లపై తాము నిలబడేందుకు అహర్నిశలు కృషి చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎ.ఓబాయపల్లెలో శ్రీలక్ష్మి నరసింహస్వామి ఎస్‌హెచ్‌జీ సభ్యురాలైన దాసరి కేశమ్మ నిర్వహిస్తున్న రంగుల దుకాణాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలలో ఉన్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో తాము కృషి చేస్తున్నామన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు అందించి వారి అభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు. తీసుకున్న రుణాన్ని సక్రమ పద్ధతిలో వినియోగిస్తే ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఏపీయం పూర్ణిమ, ఉన్నతి సంఘ సభ్యులు, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చాపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యపాడు దళితవాడలోని ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలలో మొత్తం 55 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 15 మంది 1, 2 తరగతులకు చెందిన వారు. మిగిలిన 3, 4, 5 తరగతులకు చెందిన విద్యార్థులు. ఈ విద్యార్థులను గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మోడల్ పాఠశాలలో చేర్చుతున్నారు. మరికొంత మందిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుపుతున్నారు. అధికారుల అలా చేయవద్దని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేటప్పుడు గ్రామంలో ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఎక్కువగా తిరుగుతున్నాయని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అందువలన ఇప్పుడున్న పాఠశాలలోనే విద్యార్థులందరిని కొనసాగించాలని వారు కోరుతున్నారు.

కడప కార్పొరేషన్‌లో టీడీపీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 18 (ఆంధ్ర జ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కడపలో టీడీపీని బలోపేతం చేసి కార్పొరేషన్‌లో టీడీపీ జెండా ఎగుర వేసేం దుకు టీడీపీ శ్రేణులన్నీ కష్టపడి పనిచే యా లని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డిలు పిలుపు నిచ్చా రు. బుధవారం కడపలోని ఎమ్మెల్యే నివా సంలో టీడీపీ కడప నగర సంస్థాగత ఎన్ని కల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో పార్టీ సంస్థాగత నిర్మాణం లేకపోయినప్పటికీ ఎనిమిది నెలలు కష్టపడి పనిచేసి ఎమ్మెల్యేగా మాధవిరెడ్డిని గెలిపించు కున్నామన్నారు. అదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పనిచేసి కడప కార్పొరేషన్‌లో టీడీపీ జెండా ఎగురవేయాలన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు విడ తలవారీగా పదవులు ఇస్తామని, ఎటువంటి కష్టమొచ్చినా అండగా ఉంటామన్నారు. బూత్, డివిజన్, నగర అనుబంధ కమిటీల సభ్యులు నిత్యం ప్రజలలోకి వెళ్లి వారి సమ స్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కొంత మంది కార్యకర్తలు పైరవీలు చేసి అవినీతికి పాల్పడుతున్నారని, అలా చేసి స్థాయిని దిగజార్చుకోవద్దని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి లబ్ధిచేకూరుస్తామని తెలిపారు. పార్టీకి ద్రోహం చేసేవారిని క్షమించే సమస్య లేదన్నారు. వచ్చే నెలలో నగరంలోని 50 డివిజన్లకు సంబంధించిన అభ్యర్థులను అనధికారికంగా ఖరారు చేస్తామన్నారు. ఇప్పటి నుంచే అన్ని డివిజన్లలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. టీడీపీ నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, జిలాని బాష పాల్గొన్నారు.

రూ.కోటి వ్యయంతో కేసీ కెనాల్ పరిశుభ్రత

బుక్కవంక శుభ్రతకు తీసుకున్న చర్యల తరహాలోనే కేసీ కెనాల్‌ను కోటి రూపాయల వ్యయంతో పరిశుభ్రం చేస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి తెలిపారు. బుధవారం కడప నగరం కేసీ కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న దోమల భూతాన్ని తగ్గించేదుకు ఇప్పటికే కోటి రూపాయల బడ్జెట్‌తో క్లీనింగ్ ప్రాసెస్ ప్రారంభించి గేటు ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థను వేరు చేస్తూ శుభ్రత చర్యలు చేపడుతున్నారన్నారు. స్వచ్ఛమైన కడప కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు రూరల్, జూన్ 18 (ఆంధ్ర జ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని డీసీఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాంశంకర్ (23) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టుటౌన్ ఎస్ఐ ధనుంజయుడు వివరాల మేరకు.. యూపీలోని షాజహాన్‌పూర్ జిల్లా గుత్తేటి ఉత్తర్ గ్రామానికి చెందిన రాంశంకర్ జీవనోపాధి కోసం అయిదేళ్ల కిందట ఇక్కడికి వలస వచ్చారు. తోపుడు బండిలో చెనిక్కాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇతనికి ఎనిమిది నెలల కిందట పింకి అనే యువతితో వివాహమైంది. రాంశంకర్ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు వ్యసనాలకు దూరంగా ఉండాలని పలుమార్లు నచ్చజెప్పారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటలకు మద్యం తాగిన రాంశంకర్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం సినీహబ్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలోని కంపచెట్లలో చున్నీకి ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ ధనుంజయుడు, పోలీసులు మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీజిల్ దొంగల అరెస్టు



పట్టుబడ్డ దొంగలతో సీఐ, పోలీసులు

ఎర్రగుంట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తరచు లారీల నుంచి డీజిల్ దొంగిలిస్తున్న ముగ్గురు దొంగలను ఎర్రగుంట్ల పోలీసులు మంగళ వారం అరెస్టు చేశారు. సింహాద్రిపురం మండలానికి చెందిన పసల కిషోర్, గంగనపల్లి సిద్దయ్య, మూడే వంశీనాయక్‌లు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించే నేపథ్యంలో డీజిల్ దొంగ తనాలకు అలవాటు పడ్డారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం చిలమ కూరులోని మోహన్‌రెడ్డి పెట్రోల్ బంకు వద్ద లారీలోని డీజిల్ తీస్తుం డగా గమనించిన లారీ యజమాని దస్తగిరి గట్టిగా అరచాడు. వెంటనే ఈ ముగ్గురు దొంగలు దస్తగిరి గొంతుపై కత్తిపెట్టి అరిస్తే చంపుతా మని బెదిరించారు. అతన్ని చుట్టుముట్టి రూ.2500 నగదు, 200 లీటర్ల డీజిల్‌ను దొంగిలించారు. ఇదే కాకుండా ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కమలాపురం తదితర ప్రాంతాల్లో చాలాసార్లు డీజిల్ దొంగతనం చేశారు. ముగ్గురు దొంగలను ముద్దనూరు మండలంలోని తిమ్మాపురం గ్రామం వద్ద అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఆటో, మోటార్ సైకిల్‌తో డీజిల్, రూ.2500 డబ్బును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక మహిళ మృతి

పులివెందుల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారెడ్డికాలనీకి చెందిన మంజుల (40) అనే మహిళ అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే ....రాజారెడ్డి కాలనీలో ఉండే మంజులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్దకు మార్తె బీటెక్, మరో కుమార్తె డిగ్రీ చదువుతోంది. వీరి చదువుల కోసం దాదాపు రూ.5లక్షల మేర అప్పులు చేసిం ది. ఈ అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక 14వ తేదీ విష ద్రావణం తాగి తన ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్ప డింది. ఈమెను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీనిపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సిద్దార్థ తెలిపారు.

విష పురుగు కుట్టి వ్యక్తి మృతి

కడప క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని రామక్రిష్ణనగర్‌లో వార శివబండయ్య (35) అనే వ్యక్తిని విషపురుగు కుట్టడంతో మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. రామక్రిష్ణనగర్‌కు చెందిన శివబండయ్య కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం రాత్రి ఇంట్లో కింద పడుకుని నిద్రపోతున్న సమయంలో విషపురుగు కుట్టి మరణించినట్లు తెలిపారు. భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

చెన్నూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డాయపల్లెలో బుధవారం సాయంత్రం ఓ మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి గొలుసు లాక్కెళ్లారు. స్థానిక కేవోఆర్ కాలనీలో యానిమేటరుగా పనిచేసే ఇంద్రావతి విధి నిర్వాణలో భాగంగా బుడ్డాయ పల్లెకు వచ్చారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంలో అతి వేగంగా వచ్చి ఒక్కమారుగా ఆ మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లాడు. ఆమె ప్రతిఘటించే ప్రయత్నం చేసేలోపు 4 తులాల గొలుసు లాక్కొని పారిపోయాడు. ఈ మేరకు బాధిత మహిళ స్థానిక పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

గండిలో హుండీల లెక్కింపు



చక్రాయపేట,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో బుధవారం ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుం డీల లెక్కింపు కార్య క్రమం నిర్వహించారు. ఈ లెక్కింపు ద్వారా రూ.20,81,450 ఆదాయం వచ్చిందన్నారు. అలాగే నిత్య అన్నదాన పథకం ద్వారా రూ.29,163 ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయ ధర్మాదాయశాఖ జిల్లా సూపరింటెండెంట్ రమణమ్మ, దేవస్థాన ఛైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ ఛైర్మన్ కల్లూరు వెంకటస్వామి, పోలీసులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్ ఇంటికి ఉచిత విద్యుత్



మాట్లాడుతున్న ఎస్‌ఈ రమణ

ప్రొద్దుటూరు , జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ అమర్చుకుని ఉచిత విద్యుత్ పొందవచ్చని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ తెలిపారు. బుధవారం స్థానిక డివిజనల్ విద్యుత్ కార్యాలయం ఆవరణలో సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసదస్సులో ఎస్ఈ రమణ మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ బిగించుకునే వారికి బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పిస్తున్నాయ న్నారు. కేవలం రూ.8 వేలు డౌన్ పేమెంట్ చెల్లిస్తే కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అంతే కాకుండా సోలార్ ప్యానల్ నిర్మించుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. వ్యాపార సంస్థలు, స్కూళ్లు, ఆసుపత్రులు ఈ సోలార్ ప్యానల్స్‌ను ఉపయోగిస్తే ఉచిత విద్యుత్ లభిస్తుందన్నారు. ఈఈ రమణారెడ్డి, డీఈఈలు, శ్రీనివాసులరెడ్డి, శిరీష బ్యాంకర్లు పాల్గొన్నారు.

మహాసభలు జయప్రదం చేయండి

రాజంపేట టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి):ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు సర్వేపల్లి నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ ఆవరణంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదనమోహన్, రాజంపేట ఎస్ఎఫ్ఐ నాయకులు అశోక్, నవీన్, రామ్‌చరణ్, మనోజ్, విష్ణు, బాలాజీ గురుతేజ పాల్గొన్నారు.

రేపు ఐటీఐలో ఇంటర్వ్యూలు

రాజంపేట టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 20న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామమూర్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో ప్రస్తుతం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు కూడా ప్రాంగణ ఎంపికలకు హాజరు కావచ్చునన్నారు. 2022-24లో ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు కూడా అర్హులేనని తెలిపారు. విద్యార్థులు తమ సర్టిఫికెట్లను, ఆధార్ కార్డులను వెంట తీసుకుని రావాలని ఆయన పేర్కొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం

రాజంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : బాలలకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలని రెడ్స్ కో ఆర్డినేటర్ రవీంద్రనాథ్, చైల్డ్ ప్రొడక్షన్ అధికారి రామలక్ష్మీ అన్నారు. బుధవారం పట్టణంలోని చెర్రీస్ శారదా ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధాన దారికి మోక్షం



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

రైల్వేకోడూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గుంతలు పడిన రైల్వేకోడూరు ప్రధాన దారికి మోక్షం లభించింది. ఈ సమస్యపై జనసేన పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ యువ నాయకుడు పోతురాజు నవీన్ నేషనల్ హైవే అథారిటీ అధికారులతో చర్చించడంతో పాటు ఎన్‌హెచ్‌ఏకి లేఖ రాశారు. దీంతో బుధవారం అధికారులు పనులు చేపట్టారు. గాంధీ విగ్రహం నుంచి చివరి వరకు అక్కడక్కడా రోడ్డు దెబ్బతినడంతో అధికారులు మరమ్మతులు చేపట్టారు.

వ్యక్తిపై గంజాయి ముఠా దాడి

రైల్వేకోడూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు పట్టణంలోని చింతంనగర్ వద్ద బుధవారం ఓ వ్యక్తిపై గంజాయి ముఠా దాడి చేసినట్లు సీఐ హేమసుందరావు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. ఓ మహిళతో కొందరు గొడవ పడుతుండగా ఆ దారిన వెళుతున్న రంగనాథ్ గమనించి వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా అతనిపైనా దాడికి పాల్పడ్డారు. గాయపడిన వ్యక్తిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సీఐ వివరించారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- సభలో సమస్యలపై ప్రస్తావించని వైనం
- గత 5 సంవత్సరాలుగా ఇదే తీరు



మాట్లాడుతున్న ఎంపీపీ రాజమ్మ, మధ్యాహ్నం 12 గంటలకు కూడా సభకు హాజరుకాని ప్రజాప్రతినిధులు

సుండుపల్లె, జూన్18(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒక్కసారి ఎంతో ప్రతిష్టాత్మకంగా జరగాల్సిన సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరుగుతోంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి స్థానిక ఎన్నికలు పూర్తి అయిన తర్వాత జరిగిన సర్వసభ్య సమావేశం నుంచి ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సర్వసభ్య సమావేశంలో సమస్యలు పరిష్కరించిన పాపాన పోలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ రాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు ఉదయం 10 గంటలకు సభకు హాజరు కావాల్సి ఉండగా మధ్యాహ్నం 12 గంటలకు హాజరయ్యారు. గత సమావేశంలో వివరించిన ఏ సమస్యకు పరిష్కారం చూపినట్లు ప్రస్తావించ లేదు. పైగా కీలక పంచాయతీరాజ్ శాఖకు చెందిన అధికారులు ఎవరూ సమావేశానికి హాజరు కాలేదు. మండల వ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో తాగు నీటి సమస్యలు ఉన్నాయి. ఆ శాఖకు సంబంధించిన అధికారులు హాజరుకాకపోవడం ఏమిటని ఎంపీపీ రాజమ్మ ప్రశ్నించారు. అంతేగాకుండా ఎంపీటీసీలు కూడా గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు ఎన్నికలు లేకుండా ఏకగ్రీవంగా చేసుకున్న వారు కావడంతో ప్రజా సమస్యలు ఉంటే మాకేంటి అనే ధోరణిలో వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. చిన్నగొల్లపల్లి సర్పంచ్ మినహా సర్పంచులు ఎవరూ సమావేశానికి హాజరు కాలేదు. గత ప్రభుత్వంలో సమావేశాలు నిర్వహించారు కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న నిధులు ఏం చేశారో లెక్కలు చెప్పలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి. ఎంపీటీసీలను.. 'మీరు రాకపోతే ఎలా ఖచ్చితంగా రండి, సంతకం పెట్టి పోండి' అని బతిమలాడి మరీ సర్వసభ్య సమావేశానికి తీసుకొచ్చినట్లు సమాచారం. ప్రజాప్రతినిధులకు బాధ్యత లేకపోవడం ఏమిటని పలువురు విమర్శిస్తున్నారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రెడ్డెమ్మ, విద్యాశాఖ అధికారులు వెంకటేశ్‌నాయక్, రవీంద్రనాయక్, వ్యవసాయశాఖ అధికారి మహబూబ్‌బాషా, ఏపీవో మాలిక్‌బాషా, ఉద్యాన శాఖాధికారిణి వనితాభాయి, వైద్యులు పాల్గొన్నారు.

తోతాపురి మామిడికి కిలోకు రూ.4 మద్దతు ధర

- కోడూరు ఉద్యాన శాఖాధికారి వెంకటభాస్కర్



రైల్వేకోడూరు మామిడి యార్డులో రైతులకు పర్మిట్ అందజేస్తున్న ఉద్యానశాఖాధికారి భాస్కర్

రైల్వేకోడూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తోతాపురి జ్యూస్ కాయలకు ప్రభుత్వం కిలోకు రూ.4 మద్దతు ధర ఇచ్చినట్లు రైల్వేకోడూరు ఉద్యాన శాఖ అధికారి ఎం.వెంకట భాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన రైల్వేకోడూరు మామిడి యార్డును పరిశీలించి రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు మండీల ద్వారాగాని, ఎఫ్‌పీఓల ద్వారా గాని విక్రయించినప్పుడు తమ పేర్లను పర్మిట్‌లో నమోదు చేసుకుని గుజ్జు పరిశ్రమలకు తీసుకెళ్లాలన్నారు. గుజ్జు పరిశ్రమల వద్దకు కాయలను తీసుకుని వెళితే అక్కడ తమ సిబ్బంది ఉంటారని, వారికి 1-బీ, ఆధార్ లింకు కలిగిన బ్యాంకు అకౌంట్ నెంబర్ ఉన్న పత్రాలను ఇచ్చి తమ పేర్ల నమోదు చేసుకోవాలన్నారు. పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి గుజ్జు పరిశ్రమలకు తరలించాల న్నారు. తోతాపురి మామిడి రకానికి ఇచ్చే మద్దతు ధర రూ.4లు నేరుగా రైతు బ్యాంకు ఖాతాలోకి జమ అవుతుందన్నారు. గుజ్జు, జ్యూస్ పరిశ్రమల వారు కొన్న ధరను నేరుగా రైతుకు చెల్లిస్తారన్నారు. వివరాల కోసం రైతు సేవా కేంద్రం సిబ్బంది లేదా ఉద్యాన అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు, మండీల వ్యాపారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె: మామిడి కేజీపై రూ.4 అదనంగా ఇస్తుందని ఉద్యానశాఖ అధికారిణి వనితాభాయి తెలిపారు. బుధవారం మండలంలోని మామిడికాయల మండీలను ఆమె పరిశీలించారు. ప్రతి రైతూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

చిట్వేలి: మామిడికి కేజీకి నాలుగు రూపాయల చొప్పున మద్దతు ధర చెల్లిస్తామని ఏవో సుధాకర్ తెలిపారు. బుధవారం రాజుకుంటలో ఏవో సుధాకర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన సాగులో ఉన్న బొప్పాయ తోటను పరిశీలించారు. వీహెచ్ఏ శ్రీరామ్, రైతులు పాల్గొన్నారు.

రామాపురం: లక్కిరెడ్డిపల్లె డివిజన్‌లోని రామాపురం మండలం సుద్దమళ్ల క్రాస్ వద్ద ఉన్న మామిడికాయల మండీలను బుధవారం స్థానిక ఉద్యానశాఖ అధికారిణి సింధూరి సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ పక్వానికి వచ్చిన తర్వాత మాత్రమే పంట కోయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

సంబేపల్లె, జూన్18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే నాణ్యమైన విద్యను అందిస్తున్నామని ఎంఈవో రమాదేవి, ఎంఈవో-2 శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సంబేపల్లె మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో-1 రమాదేవి స్కూల్ కమిటీ చైర్మన్ పవన్‌కుమార్‌రాజు, పాలెంగడ్డ, పాపన్నగారిపల్లె పాఠశాలలో ఎంఈవో-2 శ్రీనివాసులు ఉపాధ్యాయులతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు అందజేశారు.

రాఘవరాజుపురంలో చోరీ

రైల్వేకోడూరు రూరల్, జూలై18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవరాజుపురం గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దొంగతనం జరిగింది. రైల్వేకోడూరు సీఐ కె.హేమసుందర్ తెలిపిన వివరాల మేరకు... రాఘవరాజుపురానికి చెందిన మల్లు ప్రభాకర్ రెడ్డి కుటుంబంతో కలిసి మంగళవారం సాయంత్రం తమిళనాడులోని తిరువణ్ణామలై దేవాలయానికి వెళ్లారు. బుధవారం వారు ఇంటికి చేరుకోగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి వెళ్లి బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 84 గ్రాములు బంగారు నగలు దొంగతనం జరిగినట్లు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ స్టాళ్లను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్

రామాపురం, జూన్18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డాక్టర్లు వినోద్‌కుమార్, దివ్యశ్రీ తెలిపారు. బుధవారం రామాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతి, ఇతర పండ్ల రకాలతో విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ పవన్, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ రవీంద్రగౌడ్, రామాపురం మండలం మాస్టర్ ట్రైనర్ మధుకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతి ద్వారా పండించిన ఉత్పత్తుల ద్వారా మాత్రమే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి వెంకటమోహన్, మోడల్ మేకర్ సదాశివరెడ్డి, వెంకట్రామిరెడ్డి, సుధాకర్, హరి, ఆర్యో పర్యవేక్షకులు, ఏఎన్‌యంలు ఇంకా ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చిన్నమండెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను జిల్లా ప్రాజెక్టు మనేజర్ (డీపీఎం) వెంకటమోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఇలాంటి సమాచారం కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఏపీసీఎన్ఎఫ్ క్యాండర్లు యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్‌పీలతో సమావేశమయ్యారు. ఎంఎంటీఎల్ చందురెడ్డి, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసులు, పద్మావతి, ఇంటర్న్ యూనిట్ ఇచార్జిలు, ఐసీఆర్‌పీ పాల్గొన్నారు.

ఎంపీడీవోగా చంద్రమౌళీశ్వర



ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన చంద్రమౌళీశ్వర

గాలివీడు, జూన్18(ఆంధ్రజ్యోతి): గాలివీడు ఎంపీడీవోగా చంద్రమౌళీశ్వర బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో లక్కిరెడ్డిపల్లె మండలంలో ఏవోగా పనిచేస్తూ బదిలీపై గాలివీడుకు వచ్చారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి నిత్యం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోండి

రాజంపేట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట పట్టణం రీజెన్సీ నలందా విద్యాసంస్థల్లో నిర్వహించే ఉద్యోమేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని రీజెన్సీ చైర్మన్ డాక్టర్ బర్ల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ ఎంపికలు ప్రతి శనివారం, ఆదివారాల్లో జరుగుతాయన్నారు. ఇంటర్మీడియట్ చదివి పాస్, ఫెయిలైన విద్యార్థుల కోసం ప్రాథమిక స్క్రీనింగ్, హైదరాబాదులో ఉన్న వివిధ ఆసుపత్రుల్లో ఉద్యోగాలు పొందేందుకు ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రీజెన్సీ నలందా పూర్వ విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్, ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు.

గాదెల గంగమ్మ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఓబులవారిపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గాదెల గ్రామ పంచాయతీలో నిర్వహించే గంగమ్మ జాతరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేష్ తెలిపారు. సమస్యాత్మకమైన గ్రామం కావడం వల్ల అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మూడు రోజుల పాటు జరుగుతున్నఈ జాతర కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలకు, ప్రజలకు అవగాహన కల్పిస్తూ భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై విద్యార్థినులకు అవగాహన

సిద్దవటం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పోక్సో చట్టంపై బుధవారం టక్కోలి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు సిద్దవటం ఎస్ఐ మహమ్మద్‌రఫి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం 2012 నవంబరు 14 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి

లక్కిరెడ్డిపల్లె, జూన్18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి బాగా చదువుకోవాలని కానిస్టేబుల్ ప్రతాప్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో మాదక ద్రవ్యాలు- మత్తు పానీయాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కరపత్రాల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు.వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, నాగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

వేరుశనగ కాయల పంపిణీ ప్రారంభం

రామాపురం, జూన్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి గ్రామ పంచాయతీ సచివాలయంలో బుధవారం వేరుశనగ కాయల పంపిణీని ఆ గ్రామ టీడీపీ నాయకులు శివారెడ్డి, మదన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాచపల్లి గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రమేశ్

లక్కిరెడ్డిపల్లె, జూన్18(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా రమేశ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో చిన్నమండెం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ బదిలీపై లక్కిరెడ్డిపల్లెకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలిగేలా చూ స్తామని, పదవ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అధ్యాపకుడు శివశంకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రాజకుమార్, నాగయ్య, రాజశేఖర్, రాంమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో వసతులు ఏర్పాటు చేయాలి



డీడీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు

రాయచోటి(కలెక్టరేట్), జూన్18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హాస్టళ్లలో వసతుల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుంట శ్రీనివాసులు, బండకింద మనోహర్ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిక అధికారి రాధికను కోరారు. నూతన బాధ్యతలు చేపట్టిన రాధికను వారు బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక, సంక్షేమ శాఖ హాస్టళ్లలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులను కల్పించాలని విన్నవించారు.

ఆటోలకు ధ్రువపత్రాలు లేకుంటే జరిమానా



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

నందలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు తమ వాహనాలకు సంబంధించిన లైసెన్సు, ఇన్సూరెన్సు, పొల్యూషన్ సర్టిఫికెట్ తప్పని సరిగా ఉండాలని, లేకుంటే జరిమానా తప్పదని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి హెచ్చరించారు. బుధ వారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేయకుండా తమకు ఏర్పాటు చేసిన స్టాండులోనే ఉంచాలని సూచించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆటో డ్రైవర్లపై ఉందన్నారు. యూనిఫాం తప్పక ధరించాలని తెలిపారు. రికార్డులు లేకపోతే జరిమానా తప్పదన్నారు.

సమయానికి బస్సులేక విద్యార్థుల అవస్థలు



బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

చిట్వేలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): సమయానికి బస్సు లేక చిట్వేలిలో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. చిట్వేలి నుంచి రాజంపేటకు కళాశాలలకు రోజూ చాలా మంది విద్యార్థులు వెళుతున్నారు. ఉదయం 7.30 గంటలకు రావాల్సిన బస్సు సమయానికి రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పరీక్షలు జరుగుతున్నందున సమయానికి కాలేజీకి చేరుకోలేకున్నామన్నారు. ప్రతిరోజు ఏదోక కారణంతో బస్సు సమయానికి రాకపోవడంతో పరీక్షలకు హాజరు కాలేక పోతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు డిపోలో కూడా ఫిర్యాదు చేశామని, అయినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

రైల్వేకోడూరు అభివృద్ధిపై సీఎం సానుకూల స్పందన



సీఎం చంద్రబాబును కలిసిన ముక్కా

రైల్వేకోడూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించినట్లు జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. వారు బుధవారం ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రమైన రైల్వేకోడూరు ప్రధానదారిలో భూగర్భడ్రైనేజీ, కోడూరు-వెంకటగిరి రోడ్డు, గాలేరు-నగరి కాలువ, నరసరాంపేట వద్ద రక్షణ గోడ ఏర్పాటుపై ప్రతిపాదించామన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి నిధులు విడుదల చేయడానికి హామీ ఇచ్చారన్నారు. వారితో పాటు టీడీపీ యువ నేత ముక్కా సాయివికాస్‌రెడ్డి సీఎంను కలిశారు.

సీఎంను కలిసిన హరిప్రసాద్



సిద్దవటం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా అవకాశం కల్పించాలని సీఎం చంద్రబాబును టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ కోరారు. మంగళవారం ఏపీ సచివాలయంలో సీఎంను కలిశారు. నియోజకవర్గస్థాయిలో బలిజ సామాజిక వర్గం బలంగా ఉందని, న్యాయం చేయాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించారన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన కేకే చౌదరి

చిట్వేలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) :ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆంధ్రప్రదేశ్ ఖాదీ గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి బుధవారం అమరావతి సచివాలయంలో కలిశారు. ని యోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ బలోపేతం గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఆయన వెంట నగిరిపాడు మాజీ ఎంపీటీసీ లోకేశ్, కమ్మపల్లె సర్పంచ్ రమేష్‌బాబు ఉన్నారు.

'జర్నలిస్టు పిల్లలకు రాయితీ కల్పించాలి'

రాయచోటి(కలెక్టరేట్) జూన్18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టు పిల్లలందరికీ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలో ఫీజుల్లో రాయితీ కల్పించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గౌనిపల్లి శ్రీనివాస్ బుధవారం వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులకు చాలీచాలని జీతాలతో వారి పిల్లలకు ఫీజులు చాలా భారం అవుతున్నాయని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, నరసింమరాజు, జనార్ధన్‌రాజు, సాయిరెడ్డి, శివయ్య, రమేశ్‌కుమార్‌రాజు, బసయ్య, ప్రవీణ్‌కుమార్, భువనరెడ్డి పాల్గొన్నారు.

సిద్దవటం చేరిన పాదయాత్ర

సిద్దవటం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : బలిజ, కాపు, ఒంటరి, తెగల సామాజిక వర్గాన్ని బీసీ జాబితాలో చేర్చాలని అమరావతికి చేపట్టిన పాదయాత్ర బుధవారం సిద్దవటం మండలం చేరుకుంది. ఈ సందర్భంగా ఏపీ కాపు, బలిజ, ఒంటరి, తెలగ సాధికారిత కమిటీ సభ్యుడు ప్రసాద్ మాట్లాడుతూ జూన్ 8న చిత్తూరు నుంచి పాదయాత్ర ప్రారంభమైందన్నారు. అమరావతికి వెళ్లి ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంను కలిసి వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు.

నిరసనను విజయవంతం చేయండి: సీపీఐ

రామాపురం, జూన్18(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధి కోసం ఈ నెల 23న సీపీఐ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్రతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా హంద్రీ-నీవా కాలువ పనులు వెంటనే పూర్తి చేసి చెరువులను నింపాలన్నారు.

దేశీ వంగడాల అభివృద్ధికి కృషి

- అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో పరిశోధనలు
- దేశీ వంగడాలపై విస్తృతంగా సర్వే
- రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో వంగ రకాల సేకరణ
- ప్రజాదరణ పొందిన రకాల గుర్తింపు



ఉద్యాన పరిశోధన స్థానంలో వంగ మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

రైల్వేకోడూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాల పీహెచ్‌డీ విద్యార్థులు, శాస్త్రవేత్తలు రాష్ట్రంలోని యాగంటిపల్లె, చిమ్మిడిపాళెం, మదనపల్లె, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో వంకాయ రకాలపై విస్తృతంగా సర్వే చేశారు. పోలూరు లోకల్, శ్రీకాళహస్తి లోకల్, రాయదుర్గం లోకల్ వంటి ప్రజాదరణ పొందిన రకాలను గుర్తించారు. ఈ రకాల వంకాయలు ప్రాం తీయంగా చాలా కాలంగా సాగులో ఉన్నవి మాత్ర మే కాకుండా, తేలిక పాటి రుచి, మంచి వాసన, పం ట నాణ్యత, ఆకర్షణీయమైన గుణాలతో స్థానికంగా ఆదరణ పొందాయి. ఈ రకాలు మంచి దిగుబడి ఇస్తున్నా, కుళ్లు తెగులును తట్టుకునే శక్తి లేకపోవడం పరిశోధనల్లో గుర్తించారు. ఈ తెగులు కార ణంగా దిగుబడి తగ్గిపోతుందని తెలుసుకున్నారు. రాయలసీమ ప్రాంతంలో ఈ వంకాయ రకాల సాగు విస్తృతి, ఆదరణను దృష్టిలో ఉంచుకుని ఈ రకాల సం రక్షణ, బ్యాక్టీరియా కుళ్ల ను తట్టుకునే నూతన వంగడాలను అభివృద్ధి చేసేందుకు పరిశోధనలు చేస్తున్నారు. ఉద్యాన కళాశాల పీహెచ్‌డీ విద్యార్థి వి. వినయ్‌కుమార్, పెట్లూరు చీనీ పరిశోధన స్థానం ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ పి. శ్యాంసుందర్ రెడ్డి, ఉద్యాన కళాశాల ఆచార్యులు డాక్టర్ సయ్యద్ సదరున్నీసా, డాక్టర్ బి. హరివరప్రసాద్, డాక్టర్ కే. దినేష్ ఈ పరిశోధనల్లో పాల్గొంటున్నారు. భారతదేశంలో ప్రాచీన కాలం నుంచి సాగుచేసిన కూరగాయల్లో వంగ ప్రధానమైంది. ఫ్రాన్స్, ఇటలీ, అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో కూడా ఈ పంటను అక్కడి రైతులు పండిస్తున్నారు. మన దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఎన్నో రకాల వంగ రకాలు పండిస్తున్నారు. ఒరిస్సా, బీహార్, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వంగ విస్తారంగా పండిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రాల్లో వంగ సాగు విస్తీర్ణంలో 5వ స్థానంలో, ఉత్పత్తిలో 6వ స్థానంలో ఉంది. ఉత్పాదకతలో 3వ స్థానంలో ఉంది. కోస్తా ఆంధ్రలో పశ్చిమగోదావరి, విశాఖపట్నం, గుంటూరు, రాయలసీమలో చిత్తూరు, కర్నూలు, తెలంగాణాలో రంగారెడ్డి జిల్లాల్లో వంగ ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు.

> దేశీ వంగ వంగడాలపై అనంతరాజుపేట ఉద్యాన కళాశాల విద్యార్థులు ముమ్మరంగా పరిశోధనలు చేస్తున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా సర్వే చేశారు. ప్రజాదరణ పొందిన వంగ రకాలను గుర్తించి, సేకరించారు. చీడపీడలు ఆశించని అధిక దిగుబడినిచ్చే రకాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు



ఉద్యాన కళాశాల విద్యార్థులు సేకరించిన దేశీ రకాల వంకాయలు

సాగులో సమస్యలు

అధిక దిగుబడినిచ్చే మేలు రకాలు, సంకరజాతి విత్తనం కావాల్సినంత మేర రైతులకు లభ్యం కావడం లేదు. వినియోగదారుల అభిరుచికి తగిన రకాలు, చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడి నిచ్చే విత్తన రకాలు సరసమైన ధరలో రైతులకు అందుబాటులో ఉండడం లేదు. వెర్రి తెగులును తట్టుకుని అధిక దిగుబడినిచ్చే వంగడాలు అందుబాటులో లేవు. ఇన్ని సమస్యలున్నా అన్ని రుతువుల్లో సాగు చేయడానికి వీలు ఉండడం. బెట్టను తట్టుకోవడం, అంతర సేద్యం, కలుపు నివారణ తేలికగా ఉండడం వంగ సాగుపై ఆసక్తి చూపడానికి కారణమవుతోంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర రానప్పుడు చెట్టును వదలి లాభసాటి ధరలున్నప్పుడు కార్శీ పంట (రటూన్ పంట) తీసుకోవడానికి అవకాశముంటుంది. దూర ప్రాంతాలకు రవాణా చేసేందుకు అనుకూలంగా ఉంటుంది.

వంగ రకాలు

ప్రాంతీయ మార్కెట్లో వినియోగదారుల అభిరుచిని బట్టి రకాలు ఎంపిక చేసుకోవాలి. మన రాష్ట్రంలో గులాబీ, పూసాక్రాంతి, పూసా పర్పుల్ క్లస్టర్, శ్యామల, భాగ్యవతి రకాలు అనుకూలం. సంకరజాతి రకాలలో ఊదారంగు గుండ్రటి రకాలు ఉన్నాయి. వీటిలో ఆర్క నవనీత్, పూసా హైబ్రీడ్-6, మహికో హైబ్రీడ్ నెం.254, ఉత్కర్ష మోహిన, అగోరా, మంజు, సంజు, మ్యూమ్యూ, ఊదారంగు గుత్తి రకాలు మహీకో, రవయ్య మహీకో నెం.3 రకాలు ఉన్నాయి. రాయలసీమ ప్రాంతంలో ఎక్కువగా అర్కా కుసుమాకర్, దేశవాళీ పచ్చ వంగ రకాలు, రాయదుర్గం, పోలూరు రకాలను పండిస్తున్నారు.

అనంతరాజుపేటలో 40 రకాల వంగడాలు

అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణలో 40 రకాల వంగ రకాలపై పరిశోధనలు చేస్తున్నారు. కళాశాల విద్యార్థులు కొంగొత్త వంగడాలపై ముమ్మరంగా పరిశీలించి పరిశోధనలు చేసి తెగుళ్లను తట్టుకునేందుకు వీలుగా ఉండే వంగడాల ఉత్పత్తికి పరిశోధనలు చేస్తున్నారు.

తెగుళ్లను తట్టుకునే వంగడాలు



అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆవరణలో 40 రకాల వంగ వంగడాలపై పరిశోధనలు చేస్తున్నాం. తెగుళ్లను తట్టుకునే వంగడాలను ఎంచుకుంటున్నాం. ప్రధానంగా పోలూరు, శ్రీకాళహస్తి తదితరాలను పరిశీలిస్తున్నాం.. తెగుళ్ల నివారణ, అధిక దిగుబడి ఇచ్చే వంగడాల ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నాం.

\- వి. వినయ్‌కుమార్, పీహెచ్‌డీ విద్యార్థి

మంచి వంగడాలను ఎంచుకోవాలి



రైతులు మంచి వంగ వంగడాలను ఎంచుకోవాలి. తెగుళ్లను తట్టుకునే రకాలను రైతులకు ఇవ్వడానికి పరిశోధన స్థానాలు కృషి చేస్తున్నాయి. నాణ్యమైన విత్తనాలతోపాటు, యాజమాన్య పద్ధతులను సక్రమంగా పాటిస్తే మంచి దిగుబడులు వస్తాయి. పరిశోధనలు వేగవంతం చేస్తున్నాం.

\- పి. శ్యాంసుందర్‌రెడ్డి, పెట్లూరు పరిశోధన స్థానం ప్రిన్సిపల్ సైంటిస్ట్

కొత్త వంగడాలపై పరిశోధనలు



ఉద్యాన విద్యార్థులతో కొత్త వంగడాలపై పరిశోధనలు చేయిస్తున్నాం. రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. పరిశోధనల్లో లోటుపాట్లను పర్యవేక్షిస్తున్నాం. కూరగాయల సాగు విధానంలో విప్లవాత్మక మార్పులపై రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నాం.

\- సయ్యద్ సదరున్నీసా, ఉద్యాన కళాశాల ప్రొఫెసర్

వాతావరణం, యాజమాన్య పద్ధతులు

వంగ ఉష్ణ మండలపు పంట. అధిక ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడిని చాలా వరకు తట్టుకోగలదు. కొండ ప్రాంతాలు, చల్లటి వాతావరణంలో మొక్క పెరుగుదల తగ్గుతుంది. అధిక చలి, మంచును తట్టుకోలేదు. బాగా నీరు ఇంకే నేలలు, ఒక మాదిరి నుంచి హెచ్చు సారవంతమైన నేలలు ఈ పంట సాగుకు అనుకూలమైనది. చౌడు భూములు పనికి రావు. నేలను 4-5 సార్లు బాగా దున్ని చదును చేయాలి. వర్షాకాలపు పంటకు బోదెలు, కాలువలు, ఏర్పాటు చేయాలి. శీతాకాలపు, వేసవి 4-5 చదరపు మీటర్ల మళ్లను తయారు చేసుకోవాలి. రకాలను బట్టి బోదెలను 75 సెంటీమీటర్లు లేదా 50 సెంటీమీటర్ల దూరంలో ఉండేలా తయారు చేసుకోవాలి. పొలంలో నాటి ముందు బాగా పారించి 30-35 రోజుల వయసు గల నారును బోదెలపై నాటుకోవాలి. నాటిన వారం రోజుల మొక్కలు చనిపోయి ఖాళీగా ఉన్న పాదులలో పై నాట్లు వేయాలి. వర్షాకాలపు పంటను జూన్-జూలైలో, శీతాకాలపు పంటను అక్టోబర్-నవంబరు మాసాల్లో, వేసవి పంటను జనవరి, రెండో పక్షం నుంచి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు నారు కోసం విత్తవచ్చు. నారు పోసిన 30 నుంచి 35 రోజుల్లో నాటుకోవాలి.

హార్సిలీహిల్స్‌లో నేడు మెగా 'యోగాంధ్ర'

- హాజరు కానున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

బి.కొత్తకోట, జూన్18 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు మండల పరిధిలోని హార్సిలీహిల్స్‌లో మెగా యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లును సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, తహసీల్దార్ బాబాజాన్, ఎంపీడీవో కృష్ణవేణి, నగర పంచాయతీ కమిషనర్‌లు చేపట్టారు. గవర్నర్ బంగ్లా ముందుభాగంలో ఉన్న ఖాళీ స్థలంలో వేదిక ఏర్పాటు చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి 1000 మందికి పైగా రప్పించేలా ఏర్పాట్లు చేశారు. వెలుగు మహిళలు, అంగన్వాడీ, సచివాలయ సిబ్బంది తరలింపు కోసం ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 6 గంటలకే యోగా ప్రారంభించేలా చూడాలని కలెక్టర్ మండల అదికారులను ఆదేశించినట్లు తెలిసింది. జేసీ ఆదర్శరాజేంద్రన్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ తో పాటు పలువురు జిల్లా, మండల అధికారులు హిల్స్‌కు రానున్నారు. బాధ్యతలు అప్పగించిన అధికారులు బుధవారం రాత్రికే హిల్స్‌కు చేరుకొని ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

జిల్లా ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్ ఎంపిక



ఫుట్‌బాల్ జట్టు ప్రాబబుల్స్‌కు ఎంపికైన క్రీడాకారులు

మదనపల్లె టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపికలో భాగంగా మదనపల్లెలో జట్టు ప్రాబబుల్స్‌ను ఎంపిక చేశారు. బుధవారం స్థానిక మిషన్ కాంపౌండ్ మైదానంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జట్టు సభ్యుల ఎంపిక నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 60 మంది క్రీడాకారులు ఈ ఎంపికకు హాజరు కాగా వీరిలో 30 మందిని ఎంపిక చేసి, శిక్షణ శిబిరం నిర్వహిస్తామని అధ్యక్ష, కార్యదర్శులు దిలీప్‌కుమార్, మురళీధర్ తెలిపారు. శిక్షణ తరువాత తుది జట్టును ఎంపిక చేసి, ఈనెల 29, 30 తేదీల్లో మదనపల్లెలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిక కమిటీ సభ్యులు జాన్ కమలేశ్, అభిలాష్, బాలాజి పాల్గొన్నారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

లక్కిరెడ్డిపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యల నేపథ్యం ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు. చాగలగుట్టపల్లికి చెందిన రామాంజనేయులు(38) భార్య పిల్లలతో కలిసి బెంగుళూరులో నివసిస్తుంటాడు. వారం రోజుల క్రితం కుటుంబంతో కలసి స్వగ్రామానికి వచ్చాడు. ఈ మధ్య కాలంలో భార్య తనతో మాట్లాడడం లేదని మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం రాత్రి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు రాయచోటిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

అడవి పందులను చంపినందుకు ఇద్దరి అరెస్టు



నిందితులతో ఫారెస్టు అధికారులు

సుండుపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అడవి పందులను చంపి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్లు రేంజర్‌రాయచోటి వైపు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను బుధవారం అరెస్టు చేసినట్లు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సానిపాయి బీట్‌లోని ఎర్రచేను ప్రాంతంలో నక్క నాగరాజు, జగన్నాథం బాలు కలసి రెండు అడవి పం దులను వేటాడారు. వాటిని సంచిలో మూటగట్టుకుని ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి రిమాం డుకు తరలించినట్లు తెలిపారు. సానిపాయి, జాండ్రపేట, ఎఫ్‌బీవోలు, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

కొడుకును తల్లిదండ్రుల చెంతకు చేర్చిన పోలీసులు



కొడుకును తల్లికి అప్పగిస్తున్న ఎస్ఐ

సిద్దవటం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లుగా ఆచూకీ లేకుండా పోయిన యువకుడిని గుర్తించి మంగళవారం వారి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు. బుధవారం పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సిద్దవటం మండలం డేగనవాండ్లపలెకు చెందిన కంచర్ల నవీన్‌కుమార్‌రెడ్డి బీటెక్ చదివాడు. ఉద్యోగం కోసమని మూడేళ్ల క్రితం హైదరాబాదుకు వెళ్లాడు. గ్రూప్ కోచింగ్ కూడా తీసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో తల్లిండ్రులకు ముఖం చూపించలేక అక్కడే క్యాంటీన్‌లో ు, సినిమా ఫీల్డ్‌లో వర్కర్‌గా పనిచేసేవాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులకు కనీసం ఫోన్ కూడా చేయలేదు. దీంతో తల్లి కంచర్ల తులశమ్మ, తండ్రి రామసుబ్బారెడ్డి నెల రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 14న పోలీసులు హైదరాబాదులో గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు నవీన్‌కుమార్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని ఈ నెల 17న స్థానిక పోలీసుస్టేషన్‌లో తల్లి దండ్రులకు అప్పజెప్పామని తెలిపారు. దీంతో తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారని ఎస్ఐ మహమ్మద్‌రఫీ వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధుడికి గాయాలు

గుర్రంకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వృద్ధుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు సంగసముద్రం పంచాయతీ యల్లంపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి మంగళవారం ఎల్లుట్ల పంచాయతీ పరిధిలోని పాలేటమ్మ జాతరకు వెళ్లాడు. అమ్మవారిని దర్శించుకుని రాత్రి 11 గంటలకు ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వస్తుండగా నల్లగుట్టపల్లె వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటరమణారెడ్డి తలకు, కుడి కాలుకు గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

గుమ్మసముద్రం సచివాలయంలో ఘర్షణ

- ముగ్గురికి గాయాలు
- డిజిటల్ అసిస్టెంట్ పై కేసు నమోదు





గాయపడిన గ్రామస్తులు, వాగ్వాదం చేస్తున్న డిజిటల్ అసిస్టెంట్

బి.కొత్తకోట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరించాల్సిన ఓ ఉద్యోగి విచక్షణ కోల్పోయి గ్రామస్తులతో ఘర్షణ పడ్డాడు. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలి పిన వివరాల మేరకు పంచాయతీ పరిధిలోని గండువారిపల్లెకు చెందిన శంకర బుధవారం తన భార్యతో కలిసి సచివాలయానికి వచ్చాడు. తమ పిల్లలకు తల్లికి వందనం నిధులు పడలేదని, ఎందుకు పడలేదో చూడాలని డిజిటల్ అసిస్టెంట్ బాబా పక్రుద్దీన్‌ను అడిగాడు. అయితే, సరైన సమాధానం చెప్పకపోగా, దురుసుగా బదులిచ్చాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం ప్రారంభమైంది. మాటామాటా పెరగటంతో బాబాపక్రుద్దీన్ తనకు అందుబాటులో వున్న వస్తువుతో దాడి చేయడంతో శంకర, అన్న నాగ భూషణం గాయపడ్డారు. ఘటనలో డిజిటల్ అసి స్టెంట్‌కు సైతం స్వల్ప గాయాలవడంతో పాటు దుస్తులు చిరిగిపోయా యి. తాము తల్లికివందనం నిధు లు పడినాయా అని అడిగితే డిజిటల్ అసిస్టెంట్ తమపై దాడి చేసి గాయపరిచాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన వారిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు.


సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

- ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి

పెద్దతిప్పసముద్రం జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ గోవిందరెడ్డి సూచించారు. స్థానిక కల్యాణ మండపంలో వినియోగ దా రులు, ట్రాన్స్‌కో సిబ్బందికి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించి, సోలార్ విద్యుత్ వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. థర్మల్ విద్యుత్ వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరిగే అవకాశం ఉందని, అందుకే కేంద్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ వినియోగంపై దృష్టిసారించిందన్నారు. సోలార్ విద్యుత్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు బ్యాంకులు విరివిగా రుణాలు ఇస్తున్నాయన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా గృహ వినియోగదారులకు ఒక కిలో వాట్‌కు రూ 30,000, రెండు కిలో వాట్‌లకు రూ. 80,000, మూడు కిలో వాట్లకు రూ. 78,000 చొప్పున కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నదని, ప్రజలు తమ విద్యుత్ చార్జీలను ఆదా చేసుకోవడానికి ఇంటిపై సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకుని ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో విద్యుత్ వినియోగంతో పాటు, 70 శాతం విద్యుత్ బిల్లు కూడా తగ్గుతుందన్నారు. ప్రభుత్వం అందించే రాయితీ విషయాలను, బ్యాంకుల ద్వారా, అందుబాటులో ఉన్న రుణాల విషయం ప్రజలకు వివరించాలన్నారు. సోలార్ రూఫ్‌టాప్ అమర్చుకునేందుకు సహకారం అందించాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దతిప్పసముద్రం ఏఈ గిరిధర్, లైన్ ఇన్‌స్పెక్టర్ కందుకూరి రమణ, జూనియర్ లైన్‌మన్ రమణ, మడుమూరు లైన్ ఇన్‌స్పెక్టర్ పాపన్న, టి.సదుం లైన్‌మన్ వెంకటరెడ్డి, ఏఎల్ఎం, పి. మంజునాథ్, సబ్‌స్టేషన్ సిబ్బంది పాండురంగయ్య, వెంకటరామయ్య, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చలేక.. రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం

- వారం తర్వాత భర్త మృతి, భార్య పరిస్థితి విషమం



నాగేంద్రరెడ్డి మృతదేహం

సిద్దవటం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చలేక రైతు దంపతులు ఆత్మహత్యకు యత్నించారు. వీరు ఈనెల 10న తిరుపతిలోని ఓ లాడ్జిలో పురుగుల మందు తాగగా, ఆస్పత్రిలో చేర్పించారు. బుధవారం భర్త నాగేంద్రరెడ్డి (35) మృతి చెందగా.. ప్రాణాపాయ స్థితిలో పుష్పవేణి చికిత్స పొందుతున్నారు. తిరుపతి ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. సిద్దవటం మండలం డేగనవాండ్లపల్లెకు చెందిన నిమ్మకాయల నాగేంద్ర రెడ్డికి కొంత పొలం ఉంది. వీరికి 8, 6 ఏళ్ల వయసున్న ఇద్దరు పిల్లలున్నారు. పంటల సాగుకు అధిక వడ్డీలకు లక్షలాది రూపాయలు అప్పులు చేశారు. వ్యవసాయం కలిసిరాక పోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక సతమతమయ్యారు. ఈ క్రమంలో చనిపోవాలని భావించారు. కుమారుడు అమరనాథ రెడ్డి, కూతురు లావణ్యను తన తల్లిదండ్రులు మునిరెడ్డి, పార్వతమ్మ వద్ద వదిలి.. తాము తిరుమలకు వెళ్లొస్తామని చెప్పారు. ఈ నెల 9న తిరుపతి పెద్దకాపు లేఅవుట్‌లోని ఓ లాడ్జిలో గది తీసుకున్నారు. మరుసటి రోజు పురుగుల మందు తీసుకుని ఆత్మహత్యకు యత్నించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఈస్ట్ పోలీసులకు లాడ్జి మేనేజర్ సమాచారమిచ్చారు. దీంతో పోలీసులు వారిని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పోలీసులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ నాగేంద్రరెడ్డి బుధవారం మృతి చెందాడు. పుష్పవేణి ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఈస్ట్ సీఐ కేసు నమోదు చేశారు. భార్యాభర్తలు విషం తీసుకోవడం వెనుక కారణాలు, ఎవరెవరి వద్ద అప్పులు చేశారు? ఎందుకు చేశారు? డబ్బుకోసం ఎవరైనా వేధింపులకు గురి చేశారా అనే కోణాల్లో విచారణ చేస్తున్నామని సీఐ చెప్పారు.

తాగునీటి పైపులైన్‌కు సబ్సిడీ పైపులు!?





మిట్టమీదవారిపల్లిలో ఏర్పాటు చేసిన పైపులైన్ (పక్కన) పైపులైన్‌కు వాడిన సబ్సిడీ పైపులు (పైన)

నిమ్మనపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయి. గతంలో వైసీపీ నేతలు ఇసుక, శాండ్, క్వారీలను ఇష్టారాజ్యంగా దండుకోవడమే కాకుండా, ప్రభుత్వ పథకాల ద్వారా రైతులకు సబ్సిడీ ద్వారా మంజూరైన పనిముట్లను కూడా వదల్లేదు. కొండయ్యగారిపల్లి పంచాయతీ ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పంచాయతీ సర్పంచ్ వరలక్ష్మి భర్త శశిధర్‌రెడ్డి మిట్టమీదవారిపల్లిలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేశాడు. ఇందుకోసం వాటర్‌షెడ్ పరిధిలోని రైతులకు ప్రభుత్వం సబ్సిడీ పై మంజూరు చేసిన పైపులను వినియోగించాడు. ఆ పైపులు నాసిరకంగా ఉండడంతో రాళ్లు పడితే పగిలి పోయే పరిస్థితి.

వెంకోజిగారిపల్లిలో మురుగుకాలువలు బాగానే ఉన్నా, వాటిపై మళ్లీ ఎత్తుగా గోడ కట్టి బిల్లు లు చేసుకునేందుకు పథకం రూపొందించారు. దీనినిబట్టి పంచాయతీలో ఏమేర అవినీతి జరుగుతోందో అర్థమవుతోంది. వైసీపీ ప్రభుత్వంలో వాటర్‌షెడ్ కింద మూడు పంచాయతీలు ఎంపికయ్యాయి. ఇలాంటి గ్రామాలకు ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, పైపు లు, టార్పాలిన్ పట్టలు, చాఫ్ కట్టర్లు వంటివి మంజూరు చేస్తుంది. భూముల్లో నీరు నిల్వ చేసేందుకు కట్టలు, కుంటలు వంటి పనులు చేసుకునేందుకు నిధులు మంజూరు చేస్తుంది. కొండయ్యగారిపల్లి పంచాయతీలో రైతుల నుంచి పాస్ పుస్తకాలు సేకరించి వారికి తెలియకుండా వాటర్‌షెడ్ ద్వారా వచ్చే పనిముట్లను కాజేశారు. వాటర్‌షెడ్ పనులు చేయకనే కట్టలు వేసినట్లు బిల్లులు చేసుకున్నారు. ఇప్పుడు కూడా స్టోర్ డీలర్‌గా ఉంటూ, ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నాడు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడం గమనార్హం. తాగునీటి పైపులైన్‌కు ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చిన పైపులు అమర్చడంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మిథున్ చక్రవర్తిని వివరణ కోరగా అయన స్పందించ లేదు. కనీసం ఉన్నతాధికారులైనా స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించండి

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటమోహన్



ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న వెంకటమోహన్

చిన్నమండెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై గ్రామీణులకు అవగాహన కల్పించేందుకు ప్రతి గ్రామంలో సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ (డీపీఎం) వెంకటమోహన్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏపీసీఎన్ఎఫ్ క్యాండర్లు యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్‌పీలతో సమావేశమై ప్రకృతి వ్యవసాయం ప్రగతిపై రివ్యూ చేశారు. ముఖ్యంగా ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) విధానాన్ని ప్రతి రైతు అమలు చేయాలని పిలుపునిచ్చారు. మామిడి తోటల్లో 30 రకాల విత్తనాలను కలిపి విత్తడం వలన నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడమే కాకుండా జీవవైవిధ్యాన్ని పెంచడంలో సహాయపడుతుందన్నారు. వేరుశనగ పైరులో అంతర పంటలుగా కందులు, అలసందలు, అనప, ఆముదం, జీవవైవిధ్య పంటల గురించి తెలిపారు. ఇవి వర్షాభావ పరిస్థితిలో వేరుశనగ దిగుబడి రాకపోయినా అంతర పంటల ద్వారా అదనపు ఆదాయాన్ని రైతులకు అందిస్తాయని, ప్రధాన పంటకు తెగుళ్లు రాకుండా అరికడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఎంటీఎల్ చందురెడ్డి, మాస్టర్ ట్రైనర్లు శ్రీనివాసులు, పద్మావతి, ఇంటర్న్ యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్‌పీ పాల్గొన్నారు

విద్యార్థుల సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

- 32 వేల మంది 'తల్లికి వందనం' లబ్ధిదారులకు రూ.48 కోట్ల పంపిణీ
- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, విద్యార్థినులు

మదనపల్లె టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో నియోజకవర్గంలోని 32 వేల మంది విద్యార్థులకు తల్లికి వందనం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలతో పాటు, అదనంగా మరిన్ని పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సన్న బియ్యంతో కూడిన మధ్యాహ్న భోజనం పెడుతోందన్నారు. విదేశీ విద్యకు ప్రతి విద్యార్థికి రూ.10 లక్షల చొప్పున ఆర్థికసాయం అందిస్తోందన్నారు. డీఈవో సుబ్రమణ్యం మాట్లాడుతూ తల్లికి వందనం అందని అర్హులైన వారందరికీ తప్పక ఈ పథకం అందేలా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం ఈ పథకంలో లబ్ధి పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే చెక్కు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీవైఈవో లోకేశ్వరరెడ్డి, ఎంఈవోలు ప్రభాకర్ రెడ్డి, రాజగోపాల్, పద్మావతి, హేమలత, హెచ్ఎం సుబ్బారెడ్డి, జనసేన రాయలసీమ రీజనల్ కో-ఆర్డినేటర్ దారం అనిత, టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, నాదెళ్ల శివన్న, నీలకంఠ, సుద్దిళ్ల సుధాకర్, మహ్మద్‌ఖాన్, బాబాఫక్రుద్దీన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత.. సుఖీభవ..!

● ఈనెల 20లోపు అవకాశం ● రైతన్నా స్పందించు.. ఈకేవైసీ చేయించు.. ● కసరత్తు చేస్తున్న వ్యవసాయ యంత్రాంగం



రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ చేయించుకుంటున్న రైతులు

ప్రొద్దుటూరు రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సాగులో పెట్టుబడి ఖర్చుల తగ్గింపు, పంటల విక్రయం సులభతరం చేయడంతో పాటు రైతులకు అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం అన్నదాతా సుఖీభవ పథకాన్ని తీసుకొచ్చింది. అర్హులైన రైతులకు ఏడాదికి సాగు ఖర్చులకు రూ.20 వేలు ఆర్థికసాయం అందిస్తుంది. ఈనెల 20వ తేదీ తర్వాత ఈ పథకం అమలుకు కసరత్తు చేస్తోంది. మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయాలని నిర్ణయించింది.

ఈకేవైసీ ఇలా..

తొలకరి వానలు పలుకరిస్తున్నాయి. రైతులు ఏరువాక పనులకు సన్నద్ధమవుతున్నారు, ఖరీఫ్ కోసం పొలాలను సిద్ధం చేస్తున్నారు. సూపర్-6 పథకాలు అమలులో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం సమాయత్తం అయింది. ఈకేవైసీ చేయించుకునేందుకు క్షేత్రస్థాయిలో వివరాలను పూర్తి చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రొద్దుటూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో 21,293 మంది రైతులు ఉన్నారు. వీరిలో ప్రొద్దుటూరు మండలంలో 3,940 మంది రైతులకు 3,807 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేసుకోగా 133 మంది మిగిలి ఉన్నారు. జమ్మలమడుగు మండలంలో 4292 మందికి 4163 మంది చేయించుకోగా 129 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. మైలవరం మండలంలో 5861 మందికి గాను 5756 మంది చేయించుకోగా 105 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉంది. పెద్దముడియం మండలంలో 7191 మందికి 7011 మంది రైతులు ఈకేవైసీ చేయించుకోగా 180 మంది ఈ పక్రియను పూర్తి చేయాల్సి ఉంది.

రైతులకు ఊరట

ఈ నెల 20 లోగా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ తప్పనిసరిగా వేయాలి. గడువు తక్కువగా ఉండడంతో ఈ ప్రక్రియ కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఫార్మర్ రిజిస్ట్రీ వివరాలను అనుసంధానం చేస్తూ ఊరట కల్పించింది ప్రభుత్వం. రైతులందరు రైతు సేవా కేంద్రాలకు వచ్చి ఈకేవైసీ నమోదు చేయించుకోవాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వద్ద వివరాలు లేని రైతులు మాత్రమే వేలిముద్రలు వేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు వారి జాబితాలను రైతు సేవా కేంద్రాలకు పంపించింది. దీంతో అర్హుల గుర్తింపు సులభతరం అయింది. వీరందరు ఈకేవైసీ చేయించాలని ఆదేశించింది.



ఇలా తెలుసుకోవచ్చు..

రైతులు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ అన్నదాత సుఖీభవ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో క్లిక్ చేస్తే పేజీ తెరచుకుంటుంది. ఇందులో యువర్ స్టేటస్ అని కనపడుతుంది. దానిపై క్లిక్ చేస్తే ఆధార్ నంబరు అడుగుతుంది. ఆధార్ సంఖ్యను నమోదు చేసి పక్కనున్న క్యాప్చర్ ఎంటర్ చేసి సెర్చ్ నొక్కితే రైతు పేరు, పొలం ఉన్న గ్రామం పేరు, చివరిలో ఏఎంవో ఆమోదం (అప్రూవల్డ్) అని కనిపిస్తుంది. ఇలా రైతుకు సంబంధించిన వివరాలు కనిపిస్తే పథకానికి అర్హత పొందినట్లు అని అధికారులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న రైతులు సులభంగా పథకంలో అర్హత ఉందో లేదో తెలుసుకుంటున్నారు. పేరు లేకపోతే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి కారణాలు తెలుసుకోవచ్చునని సూచించారు.

21న తొలి విడత

అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఏటా రూ.20 వేలు చొప్పున ఆర్థికసాయం అందిస్తామని సూపర్-6లో భాగంగా కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీనికి అనుగుణంగా అర్హులైన కుటుంబాలకు మూడు విడతల్లో సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఈనెల 21వ తేదీన తొలివిడతగా రైతుల ఖాతాల్లో రూ.7వేలు జమ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు ప్రకటించారు.

ప్రక్రియ పూర్తి చేస్తాం..



అన్నదాత సుఖీభవ పథకానికి ఈకేవైసీ చేయించుకోని రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలి. ఈకేవైసీ చేయించుకోని రైతులు తక్కువ మంది ఉన్నారు. రైతులకు సర్కారు ఊరటనిస్తూ వివిధ పథకాల్లోని ఈకేవైసీ జాబితాను సుఖీభవ అర్హులతో అనుసంధానించేందుకు ప్రక్రియ సులభతరం చేసింది. అర్హులైన వారికి సాయం అందేలా ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది.

- పి.సురేష్‌రెడ్డి, ఏడీఏ, ప్రొద్దుటూరు డివిజన్

గండికోట పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

జమ్మలమడుగు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక మ్యాపులో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న గండికోట పర్యాటక అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తుండగా .. ఒబేరాయ్ సంస్థ ఆతిధ్య సేవల కోసం సిద్ధమవుతోందని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం గండికోట పర్యాటక కేంద్రంలో యోగాంధ్ర కార్యక్రమానికి హాజరైన కలెక్టర్, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు కలిసి సుప్రసిద్ధ ఒబేరాయ్ హోటల్ నిర్మాణానికి సంబంధించిన స్థలాలను పరిశీలించారు. అనంతరం సమీపంలోని మైలవరం బోటింగ్ పాయింట్‌ను, అక్కడకు వెళ్లే మార్గాన్ని ఎమ్మెల్యే ఆదితో కలిసి పరిశీలించి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో అత్యంత ప్రాచీన చారిత్రక ప్రాచుర్యం పొందిన గండికోట పర్యాటక కేంద్రం భవిష్యత్తులో ప్రపంచ పర్యాటక రంగాన్ని శాశిస్తోందనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఆదిశగా ఇప్పటికే గండికోట అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసి అభివృద్ధి ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. మరోవైపు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తూ అధునాతన, విలాసవంతమైన సదుపాయాలతో స్టాల్‌హోటళ్ల సముదాయాన్ని ఏర్పాటు చేసేందుకు ఒబేరాయ్ సంస్థ ప్రణాళికలు రూపొందించిందన్నారు. ఒబేరాయ్ హోటల్స్ ఏర్పాటులో భాగంగా ఆ సంస్థ చేపట్టే నిర్మాణాల వివరాలు, మౌలిక సదుపాయాలు అయిన రోడ్లు, హెలిప్యాడ్, రిసార్ట్ భవనాలను నిర్మించనున్నారన్నారు. అనంతరం కలెక్టర్, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, జిల్లా టూరిజం అధికారి సురేష్‌కుమార్, సంబందిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

● ఇంటింటా ప్రచారంలో ఉపాధ్యాయులు



ఇంటింటా ప్రచారంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యను అందించే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్చాలని కడప శివారులోని రాజీవ్ గృహకల్పలోని (21వ వార్డు) నగరపాలక మోడల్ ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులోచనరాణి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఎన్వీ ప్రసాదరెడ్డి, లక్ష్మీనారాణమ్మ, జె.ఆనందకుమార్, టి.సత్యనారాయణ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సల్మాన్‌ఖాన్, సిబ్బంది విజయ కలిసి ఇంటింటికి వెళ్లి విద్య ఆవశ్యకతను వివరించారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, బ్యాగు, యూనిఫాం, బెల్ట్, షూ, సాక్సులు, మధ్యాహ్నం పౌష్టికాహారం ప్రభుత్వం పిల్లలకు అందిస్తోందని అవగాహన కల్పించారు. పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థి అమ్మ అకౌంట్‌లో తల్లికి వందనంపేరుతో ప్రభుత్వం రూ.15వేలు జమచేస్తోందన్నారు. అర్హత, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు.

క్రిష్టంపల్లె పాఠశాల అభివృద్ధికి కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్

పోరుమామిళ్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్టంపల్లె పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షంషుద్దీన్ అన్నారు. మంగళ వారం ఆయన ఆ పాఠశాలను పరిశీలించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సన్నబియ్యం వచ్చాక తేడాను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పాఠశాలను హైస్కూలుగా మార్చడానికి ఎందుకు ప్రపోజల్ పంపలేదని అడిగారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఈ పాఠశాలను దత్తతగా తీసుకంటానని, ఇప్పటి నుంచి ఇది మనందరి పాఠశాల అని, అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. పాఠశాల అభివృద్ధిలో గ్రామస్తులు కూడా తమ వంతు సహాయం చేసి భాగస్వాములు కావాలన్నారు.

డ్వాక్రా మహిళల అభివృద్ధే లక్ష్యం



డ్వాక్రా సంఘ సభ్యులతో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టరు

వల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): డ్రాక్వా గ్రూపులోని ప్రతి మహిళ తమ కాళ్లపై తాము నిలబడేందుకు అహర్నిశలు కృషి చేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు రాజ్యలక్ష్మి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎ.ఓబాయపల్లెలో శ్రీలక్ష్మి నరసింహస్వామి ఎస్‌హెచ్‌జీ సభ్యురాలైన దాసరి కేశమ్మ నిర్వహిస్తున్న రంగుల దుకాణాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలలో ఉన్న మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో తాము కృషి చేస్తున్నామన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు అందించి వారి అభివృద్ధికి పాటుపడుతున్నామని తెలిపారు. తీసుకున్న రుణాన్ని సక్రమ పద్ధతిలో వినియోగిస్తే ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఏపీయం పూర్ణిమ, ఉన్నతి సంఘ సభ్యులు, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట తల్లిదండ్రుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

చాపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యపాడు దళితవాడలోని ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన వ్యక్తం చేశారు. పాఠశాలలో మొత్తం 55 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో 15 మంది 1, 2 తరగతులకు చెందిన వారు. మిగిలిన 3, 4, 5 తరగతులకు చెందిన విద్యార్థులు. ఈ విద్యార్థులను గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న మోడల్ పాఠశాలలో చేర్చుతున్నారు. మరికొంత మందిని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలుపుతున్నారు. అధికారుల అలా చేయవద్దని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేటప్పుడు గ్రామంలో ట్రాక్టర్లు, ఇతర వాహనాలు ఎక్కువగా తిరుగుతున్నాయని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అందువలన ఇప్పుడున్న పాఠశాలలోనే విద్యార్థులందరిని కొనసాగించాలని వారు కోరుతున్నారు.

కడప కార్పొరేషన్‌లో టీడీపీ జెండా ఎగురవేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 18 (ఆంధ్ర జ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి కడపలో టీడీపీని బలోపేతం చేసి కార్పొరేషన్‌లో టీడీపీ జెండా ఎగుర వేసేం దుకు టీడీపీ శ్రేణులన్నీ కష్టపడి పనిచే యా లని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆర్.మాధవిరెడ్డిలు పిలుపు నిచ్చా రు. బుధవారం కడపలోని ఎమ్మెల్యే నివా సంలో టీడీపీ కడప నగర సంస్థాగత ఎన్ని కల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడపలో పార్టీ సంస్థాగత నిర్మాణం లేకపోయినప్పటికీ ఎనిమిది నెలలు కష్టపడి పనిచేసి ఎమ్మెల్యేగా మాధవిరెడ్డిని గెలిపించు కున్నామన్నారు. అదే స్ఫూర్తితో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పనిచేసి కడప కార్పొరేషన్‌లో టీడీపీ జెండా ఎగురవేయాలన్నారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు విడ తలవారీగా పదవులు ఇస్తామని, ఎటువంటి కష్టమొచ్చినా అండగా ఉంటామన్నారు. బూత్, డివిజన్, నగర అనుబంధ కమిటీల సభ్యులు నిత్యం ప్రజలలోకి వెళ్లి వారి సమ స్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కొంత మంది కార్యకర్తలు పైరవీలు చేసి అవినీతికి పాల్పడుతున్నారని, అలా చేసి స్థాయిని దిగజార్చుకోవద్దని తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి లబ్ధిచేకూరుస్తామని తెలిపారు. పార్టీకి ద్రోహం చేసేవారిని క్షమించే సమస్య లేదన్నారు. వచ్చే నెలలో నగరంలోని 50 డివిజన్లకు సంబంధించిన అభ్యర్థులను అనధికారికంగా ఖరారు చేస్తామన్నారు. ఇప్పటి నుంచే అన్ని డివిజన్లలో క్షేత్ర స్థాయిలో పర్యటించి పార్టీని బలోపేతం చేయాలన్నారు. టీడీపీ నాయకులు పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, జిలానిబాష పాల్గొన్నారు.

రూ.కోటి వ్యయంతో కేసీ కెనాల్ పరిశుభ్రత

బుక్కవంక శుభ్రతకు తీసుకున్న చర్యల తరహాలోనే కేసీ కెనాల్‌ను కోటి రూపాయల వ్యయంతో పరిశుభ్రం చేస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి తెలిపారు. బుధవారం కడప నగరం కేసీ కెనాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న దోమల భూతాన్ని తగ్గించేదుకు ఇప్పటికే కోటి రూపాయల బడ్జెట్‌తో క్లీనింగ్ ప్రాసెస్ ప్రారంభించి గేటు ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థను వేరు చేస్తూ శుభ్రత చర్యలు చేపడుతున్నారన్నారు. స్వచ్ఛమైన కడప కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి



ప్రొద్దుటూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని డీసీఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాంశంకర్ (23) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టుటౌన్ ఎస్ఐ ధనుంజయుడు వివరాల మేరకు.. యూపీలోని షాజహాన్‌పూర్ జిల్లా గుత్తేటి ఉత్తర్ గ్రామానికి చెందిన రాంశంకర్ జీవనోపాధి కోసం అయిదేళ్ల కిందట ఇక్కడికి వలస వచ్చారు. తోపుడు బండిలో చెనిక్కాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఇతనికి ఎనిమిది నెలల కిందట పింకి అనే యువతితో వివాహమైంది. రాంశంకర్ మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు వ్యసనాలకు దూరంగా ఉండాలని పలుమార్లు నచ్చజెప్పారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటలకు మద్యం తాగిన రాంశంకర్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం సినీహబ్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలోని కంపచెట్లలో చున్నీకి ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్ఐ ధనుంజయుడు, పోలీసులు మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డీజల్ దొంగల అరెస్టు



పట్టుబడ్డ దొంగలతో సీఐ, పోలీసులు

ఎర్రగుంట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తరచు లారీల నుంచి డీజల్ దొంగిలిస్తున్న ముగ్గురు దొంగలను ఎర్రగుంట్ల పోలీసులు మంగళ వారం అరెస్టు చేశారు. సింహాద్రిపురం మండలానికి చెందిన పసల కిషోర్, గంగనపల్లి సిద్దయ్య, మూడే వంశీనాయక్‌లు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈజీగా డబ్బు సంపాదించే నేపథ్యంలో డీజల్ దొంగ తనాలకు అలవాటు పడ్డారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం చిలమ కూరులోని మోహన్‌రెడ్డి పెట్రోల్ బంకు వద్ద లారీలోని డీజల్ తీస్తుం డగా గమనించిన లారీ యజమాని దస్తగిరి గట్టిగా అరచాడు. వెంటనే ఈ ముగ్గురు దొంగలు దస్తగిరి గొంతుపై కత్తిపెట్టి అరిస్తే చంపుతా మని బెదిరించారు. అతన్ని చుట్టుముట్టి రూ.2500 నగదు, 200 లీటర్ల డీజల్‌ను దొంగిలించారు. ఇదే కాకుండా ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల, ముద్దనూరు, కమలాపురం తదితర ప్రాంతాల్లో చాలాసార్లు డీజల్ దొంగతనం చేశారు. ముగ్గురు దొంగలను ముద్దనూరు మండలంలోని తిమ్మాపురం గ్రామం వద్ద అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఆటో, మోటార్ సైకిల్‌తో డీజల్, రూ.2500 డబ్బును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు.

అప్పుల బాధ తాళలేక మహిళ మృతి

పులివెందుల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారెడ్డికాలనీకి చెందిన మంజుల (40) అనే మహిళ అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే ....రాజారెడ్డి కాలనీలో ఉండే మంజులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో పెద్దకు మార్తె బీటెక్, మరో కుమార్తె డిగ్రీ చదువుతోంది. వీరి చదువుల కోసం దాదాపు రూ.5లక్షల మేర అప్పులు చేసిం ది. ఈ అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక 14వ తేదీ విష ద్రావణం తాగి తన ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్ప డింది. ఈమెను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీనిపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సిద్దార్థ తెలిపారు.

విష పురుగు కుట్టి వ్యక్తి మృతి

కడప క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని రామక్రిష్ణనగర్‌లో వార శివబండయ్య (35) అనే వ్యక్తిని విషపురుగు కుట్టడంతో మృతి చెందినట్లు రిమ్స్ పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. రామక్రిష్ణనగర్‌కు చెందిన శివబండయ్య కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. మంగళవారం రాత్రి ఇంట్లో కింద పడుకుని నిద్రపోతున్న సమయంలో విషపురుగు కుట్టి మరణించినట్లు తెలిపారు. భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

చెన్నూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడ్డాయపల్లెలో బుధవారం సాయంత్రం ఓ మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి గొలుసు లాక్కెళ్లారు. స్థానిక కేవోఆర్ కాలనీలో యానిమేటరుగా పనిచేసే ఇంద్రావతి విధి నిర్వాణలో భాగంగా బుడ్డాయ పల్లెకు వచ్చారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంలో అతి వేగంగా వచ్చి ఒక్కమారుగా ఆ మహిళ మెడలోని గొలుసు లాక్కెళ్లాడు. ఆమె ప్రతిఘటించే ప్రయత్నం చేసేలోపు 4 తులాల గొలుసు లాక్కొని పారిపోయాడు. ఈ మేరకు బాధిత మహిళ స్థానిక పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

గండిలో హుండీల లెక్కింపు



చక్రాయపేట,జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో బుధవారం ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో హుం డీల లెక్కింపు కార్య క్రమం నిర్వహించారు. ఈ లెక్కింపు ద్వారా రూ.20,81,450 ఆదాయం వచ్చిందన్నారు. అలాగే నిత్య అన్నదాన పథకం ద్వారా రూ.29,163 ఆదాయం వచ్చిందన్నారు. దేవదాయ ధర్మాదాయశాఖ జిల్లా సూపరింటెండెంట్ రమణమ్మ, దేవస్థాన చైర్మన్ కావలి కృష్ణతేజ, మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, పోలీసులు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్ టాప్ ఇంటికి ఉచిత విద్యుత్



మాట్లాడుతున్న ఎస్‌ఈ రమణ

ప్రొద్దుటూరు , జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్ అమర్చుకుని ఉచిత విద్యుత్ పొందవచ్చని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ రమణ తెలిపారు. బుధవారం స్థానిక డివిజనల్ విద్యుత్ కార్యాలయం ఆవరణలో సోలార్ విద్యుత్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసదస్సులో ఎస్‌ఈ రమణ మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ బిగించుకునే వారికి బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణ సదుపాయం కల్పిస్తున్నాయ న్నారు. కేవలం రూ.8 వేలు డౌన్ పేమెంట్ చెల్లిస్తే కిలో వాట్ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అంతే కాకుండా సోలార్ ప్యానల్ నిర్మించుకున్న వారికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. వ్యాపార సంస్థలు, స్కూళ్లు, ఆసుపత్రులు ఈ సోలార్ ప్యానల్స్‌ను ఉపయోగిస్తే ఉచిత విద్యుత్ లభిస్తుందన్నారు. ఈఈ రమణారెడ్డి, డీఈఈలు, శ్రీనివాసులరెడ్డి, శిరీష బ్యాంకర్లు పాల్గొన్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు

ప్రొద్దుటూరు, ప్రొద్దుటూరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్, సిద్దారెడ్డిలను వీఆర్‌కు ఆదేశిస్తూ బుధవా రం ఎస్పీ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని రూరల్ సీఐ బాలమద్ది లేటి తెలిపారు. ఇటీవల లక్ష్మి నరసింహ అనే క్రికెట్ బుకీ తన వద్ద వీరు మామూళ్ల రూపంలో నగదును వసూలు చేసి ఆపై వేధించారని సోషల్ మీడి యా వేదికగా వీడియో కూడా విడుదల చేశాడు. ఈక్రమంలో వీరిపై అవినీతి ఆరోపణలు రావడం తో ఈమేరకు ఉన్నతాధికారుల చర్యలు తీసుకున్నారు. వీరిలో రాజ్‌కు మార్ ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యి వీఆర్‌కు వెళ్లగా, సిద్దారెడ్డి ప్రస్తు తం విశాఖపట్నంలోని ప్రధానమంత్రి పర్యటన నేపథ్యంలో బందో బస్తు విధులకు వెళ్లారు. అక్కడి నుంచి రాగానే జిల్లా ఎస్పీ కార్యా లయంలో హాజరుకానున్నారని ఆయన వివరించారు.

తోతాపురి రైతుకు అండగా ప్రభుత్వం

కిలోకు రూ.4 ప్రోత్సాహకం



మదనపల్లె మార్కెట్‌లో రైతులు, వ్యాపారులతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి

మదనపల్లె టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తోతాపురి రకం మామిడి పంట సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం అండగా వుంటుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి అన్నారు. మదనపల్లె మామిడి మార్కెట్‌లో రైతులు, వ్యాపారులతో చర్చించిన ఆమె మాట్లాడుతూ రైతులు తోతాపురి మామిడికాయలను కోసి జ్యూస్ ఫ్యాక్టరీలకు పంపితే ప్రభుత్వం వారికి కిలోకు రూ.4 ప్రోత్సాహకం అందిస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో తోతాపురి ధర రూ.6 నుంచి రూ8 పలుకుతోందని, దీనికి అదనంగా ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందన్నారు. ఈ మద్దతు ధరను ఆగస్టు నెలాఖరు వరకు ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. రైతులు పక్వానికి వచ్చిన మామిడి కాయలనే కోయాలని, విడతల వారీ కోతలు కోసి జ్యూస్ ఫ్యాక్టరీకి తరలించాలన్నారు. దీనికి రైతులు పాసుపుస్తకాల వన్-బీ, ఆధార్‌కార్డు, ఆధార్ లింక్ అయిన బ్యాంకు పాస్‌పుస్తకం తీసుకెళ్లి జ్యూస్‌ఫ్యాక్టరీ వద్ద వున్న అధికారులకు అందించాలన్నారు. మద్దతు ధర నగదు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతుందన్నారు. వివరాలకు ఆయా నియోజకవర్గ ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలన్నారు. మదనపల్లె ఉద్యానశాఖ అధికారి ఈశ్వర్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కాయలు ఎక్కడైనా అమ్ముకోవచ్చు

పీలేరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తోతాపురి కాయలను రైతులు ఎక్కడైనా అమ్ముకోవచ్చని పీలేరు ఉద్యాన శాఖాధికారి సుకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తోతాపురి రకం మామిడి పండించిన ప్రతి రైతు తన చివరి కాయ అమ్ముకునే వరకు ప్రభుత్వం అందించే రూ.4 సబ్సిడీ లభ్యమవుతుందన్నారు. కాయలను జ్యూస్ ఫ్యాక్టరీ, ఎఫ్‌పీఓ, ర్యాంపు, మండీల్లో ఎక్కడైనా అమ్ముకోవచ్చని, రైతులకు సహాయకారిగా ఉండేందుకు ప్రభుత్వం ఎఫ్‌పీఓ, ర్యాంపు, మండీ, జ్యూస్ ఫ్యాక్టరీల వద్ద సచివాలయ సిబ్బందిని నియమించిందన్నారు. అక్కడకు వెళ్లే రైతులు తమ వెంట విధిగా పాసు బుక్కు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుబుక్కు జిరాక్స్ వెంట తీసుకెళ్లాలని సూచించారు.

వృద్ధులకు సరుకుల పంపిణీ చేపట్టాలి

తహసీల్దారును సన్మానించిన రేషన్ డీలర్లు



తహసీల్దార్ కిరణ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

మదనపల్లె, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వృద్ధులకు రేషన్ సరుకులను ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని తహసీల్దార్ కిరణ్‌కుమా ర్‌రెడ్డి సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం సాయంత్రం రేషన్ డీలర్లతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ఇప్పటికే విడతల వారీ ఈకే వైసీ పూర్తి చేయగా, మదనపల్లె అర్బన్, రూరల్ మండలంలో ఇంకా ఎనిమిది వేల మంది సభ్యులు ఉన్నారని, వారికి కూడా ఈనెలాఖరులోగా పూర్తి చేయించాలన్నారు. ప్రభుత్వం కూడా చివరి అవకాశం ఇచ్చిందన్నారు. జూలై సంబంధించి వృద్ధులు, వికలాంగులకు 26వతేదీ నుంచి 30వతేదీ వరకూ అడ్వాన్సుగా ఇంటికెళ్లి సరుకులు అందజేయాలని, ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన వివరించారు. అనంతరం కొత్తగా వచ్చిన తహసీల్దార్‌ను, సీఎస్ డీటీ ఎన్.ఫిరోజ్‌ఖాన్‌ను డీలర్లు సన్మానించారు. డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌మౌలాలి, ఇమాం ఖాసీం, సుధీర్‌బాబు, రాజన్న, కోళ్లబైలు రవీంద్ర, కృష్ణమూర్తి, కళాధర్, ఖాజాహుస్సేన్, భాగ్యమ్మ, షహనాజ్‌బేగం, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తిని సన్మానిస్తున్న ప్రజా సంఘ నేతలు

పీలేరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పురం రామ్మూర్తిని సన్మానించారు. బుధవారం పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు నేతలు మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి గెలుపులో శక్తికి మించి కృషి చేశారని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తోందన్నారు. మార్కెట్ కమిటీని ఆదర్శంగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రామ్మూర్తిపై ఉందన్నారు. పదవి శాశ్వతం కాదని, అయితే పదవిలో ఉన్నన్ని రోజులు శక్తి వంచన లేకుండా మార్కెట్ కమిటీ అభివృద్ధిలో రాజీ పడరాదన్నారు. కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీని అభివృద్ధిలో ముందుకు తీసుకెళతానని చెప్పారు. మార్కెట్ యార్డులో రైతులు, వ్యాపారులకు మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు. ప్రజా సంఘాల నేతలు నగిరిమడుగు సుభాష్, వెంకటేష్, సుధాకర్, ముల్లంగి చద్రయ్య, దుబ్బాశ్రీకాంత్, ఆంజి, భానుప్రకాష్ తదితరుల పాల్గొన్నారు.

హాస్టల్‌లో వసతులు ఏర్పాటు చేయాలి

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హాస్టళ్లలో వసతుల ఏర్పాటుపై దృష్టి సా రించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మా నిటరింగ్ కమిటీ సభ్యుడు పాలకుంట శ్రీనివాసులు, బండ కింద మనోహర్ జి ల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిక అధికారి రాధికను కోరారు. నూతన బాధ్యతలు చేపట్టిన రాధికను వారు బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని సాంఘిక, సంక్షేమ శాఖ హాస్టళ్లలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులను కల్పించాలని విన్నవించారు.

యమపాశాలు ?

- చోద్యం చూస్తున్న విద్యుత్ అధికారులు
- ప్రమాదాల బారిన పడుతున్న రైతులు



గుంటలపేటలో ఓ ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగలు

రామసముద్రం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పొలాల్లో, ఇళ్ల పైన, జన సంచార ప్రదేశాల్లో విద్యుత్ తీగలు చేతికి అందేలా వేలాడుతూ మృత్యువును ఆహ్వానిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని ఇటు రైతులు, అటు ప్రజలు బిక్కు బిక్కు మంటూ కాలం గడుపుతున్నారు. వ్యవసాయ పొలాల్లో పశుగ్రాసాన్ని తాకేంత కిందగా విద్యుత్ తీగలు ఉండడంతో గడ్డి కోత సమయంలో రైతులు విద్యుదాఘాతానికి గురవుతున్నారు. నారిగానిపల్లె రైతు భాస్కర్ టమోటా క్రేట్లు ట్రాక్టర్‌కు లోడు చేస్తూ విద్యుత్ తీగలు తగిలి ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అలాగే గతంలో కూడా కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి పశువులు సైతం మృతి చెందిన సంఘటనలు చోటు చేసుకున్నా విద్యుత్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలున్నాయి. వ్యవసాయ పంపుసెట్లకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు చెట్లకు అల్లుకు పోయి ఉండడంతో వర్షం పడితే చెట్లకు విద్యుత్ ప్రవహించి పశువులు, మనుషులు విద్యుత్ షాక్‌కు గురవుతున్నారు. ఇళ్లపై విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉండడంతో పిల్లలు, మహిళలు విద్యుత్‌షాక్‌కు గురవుతున్నారు. మండల కేంద్రంలో రోజు వారి సంత జరిగే స్థలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చేతికందేలా కింద ఉండడమే కాకుండా చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. అసలే వర్షాకాలం దీనికి తోడు విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉంటే ప్రమాదాలు ఏ స్థాయిలో ఉంటాయో అని ప్రజలు భయపడుతున్నారు. వీటిపై విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ తీగలు సరిచేసి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



రోజువారి సంత జరిగే స్థలంలో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



చెట్లను తాకుతున్న విద్యుత్ తీగలు

రూఫ్‌టాప్‌పై ప్రజల్లో అవగాహన కల్పించండి

- అవగాహన సదస్సులో ఈఈ చంద్రశేఖర్ రెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖర్ రెడ్డి

కలికిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్య ఘర్ పథకం రెండేళ్ల కిందటే ప్రధాని ప్రారంభించినా విస్తృత ప్రచారంతో ప్రజల్లో అవగాహన కల్పించలేకపోడంతో ఇది ప్రాచుర్యంలోకి రాలేదని ఎపీఎస్పీడీసీఎల్ పీలేరు ఈఈ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. చంద్రబాబు నాయుడు సీఎం అయిన తరువాత ఇంటింటికీ దీన్ని వర్తింపజేయాలని పట్టుదలతో వుండడంతో ఇప్పుడిప్పుడే దీనిపైన ప్రజల్లో అవగాహన కలుగుతోందని ఆయన తెలిపారు. స్థానిక ఎస్పీడీసీఎల్ ఆవరణలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రూఫ్ టాప్ సోలార్‌తో వినియోగదారునికి, ప్రభుత్వానికి పరస్పర ప్రయోజనాలున్నాయని వెల్లడించారు. సోలార్ విద్యుదుత్పత్తి కారణంగా పర్యావరణానికి హాని కలగని విధంగా కర్బన రసాయనాలకు అతీతంగా జరుగుతుందని చెప్పారు. ఇంటి పైభాగంలో ఖాళీ స్థలంలో దీన్ని అమర్చుకోవచ్చని, గతంలో వున్న నిబంధనలను సరళతరం చేసి బ్యాంకు రుణాల ద్వారా ఆర్థిక వెసులుబాటు కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. 3 కిలో వాట్ల సామర్థ్యమున్న యూనిట్‌ను అమర్చుకుంటే రూ.78 వేల సబ్సిడీ వస్తుందన్నారు. యూనిట్ ఏర్పాటు చేసిన 25 రోజుల్లోగా సబ్సిడీ బ్యాంకు ఖాతాలో జమవుతుందని చెప్పారు. మధ్య తరహాగా రెండు కిలోవాట్ల యూనిట్ ద్వారా నెలకు 240 యూనిట్లు ఉత్పత్తి అవుతందన్నారు. గృహ వినియోగానికి పోను మిగిలిన విద్యుత్తు గ్రిడ్‌కు చేరుతుందని, యూనిట్‌కు రూ.2.9లు వంతున చెల్లిస్తామన్నారు. ఐదేళ్ల పాటు ఉచితంగా నిర్వహణ సేవలు అందిస్తామన్నారు. ఒకసారి యూనిట్ అమర్చుకుంటే కంపెనీలు కనీస కాలం 25 ఏళ్ళుగా చెపుతున్నా ఇంకా ఎక్కువ కాలమే మన్నికలో వుంటుందన్నారు. దీనికి అవసరమైన కొత్త రకం మీటరుకు గతంలో రూ.5 వేల వంతున వసూలు చేసేవారమని కానీ ప్రస్తుతం ఉచితంగా అమర్చుతున్నామన్నారు. విద్యుత్ సిబ్బందికి ఫోను చేసి చెపితే వెంటనే చర్యలు తీసుకుంటామని ఈఈ వివరించారు. సోలార్ రూఫ్‌టాప్ అమర్చుకున్న వారందరికీ నెలా నెలా ఆదాయం సమకూరుతుందని, విద్యుత్ చార్జీలు చెల్లించే అవసరం కూడా వుండదన్నారు. ఏ కంపెనీకి చెందిన యూనిట్టయినా అమర్చు కోవచ్చన్నారు. రూఫ్‌టాప్ అమర్చుకున్న వినియోగదారుల అభిప్రాయాలను సమావేశంలో వివరించారు. ప్రతి నెలా రూ.వేయి నుంచి 12 వందల వరకూ తమకు గ్రిడ్ నుంచి ఆదాయం వస్తోందని తమ అనుభవాలను వివరించారు. ఇంకా ఎవరికైనా సందేహాలుంటే యూనిట్లు అమర్చుకున్న వారి అనుభవాలను పరిశీలించుకోవచ్చని సూచించారు. స్థానిక ఎస్బీఐ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ సరళతరమైన కంతులతో అవసరమైౖ రుణాలను వెంటనే మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈఈ సహా కలికిరి డీఈఈ శివయ్య, డిప్యూటీ ఎంపీడీఓ రియాజుద్దీన్, ఏఈఈ ముజిబుర్ రెహ్మాన్, సర్పంచు వెంకటరెడ్డి, ఎస్పీడీసీఎల్ అధికార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలో అగ్రస్థానాల్లోకి దేశం



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్‌నాయుడు

మదనపల్లె టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ పాలనలో భారతదేశం ప్రపంచంలోని అగ్రదేశాల స్థానాల్లోకి దూసుకెళుతోందని బీజేపీ నంద్యాల ఇన్‌చార్జి పోతుగుంట రమేశ్‌నాయుడు అన్నారు. బుధవారం సీటీఎంలో బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వికసిత్ భారత్ చేపట్టిన ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న పథకాల ద్వారా కోట్లాదిమంది ప్రజలు లబ్ధిపొందుతున్నారన్నారు. కిసాన్‌మోర్చా జోనల్ ఇన్‌చార్జి ఓసూరి కిరణ్, జిల్లా ఉపాధ్యక్షులు పులి నరేంద్రకుమార్‌రెడ్డి, పిల్లానాయక్, భువనేశ్వరి సత్య, పాల్గొన్నారు.

గర్భిణులు క్రమం తప్పకుండా పరీక్షలు చేసుకోవాలి

తంబళ్లపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గర్భి ణులు క్రమం తప్ప కుండా ప్రతి నెలా ప రీక్షలు చేయించుకుం టూ, వైద్యుల సూచ నలు పాటించాలని తంబళ్ల పల్లె ప్రభు త్వాస్పత్రి వైద్యాధికారి తేజశ్విని సూచించా రు. బుధవారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో పీఎం సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు క్రమంగా ఆరోగ్య తనిఖీ చేయించుకుంటూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, అన్ని వసతులతో సాధారణ ప్రసవాలు చేస్తారన్నారు. ప్రభు త్వాస్పత్రుల్లో కాన్పు అయితే తల్లీ, బిడ్డ క్షేమంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. హెడ్ నర్సు గ్లోరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పరిశీలకుల నియామకం

మదనపల్లె టౌన్/రామసముద్రం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం చౌడేపల్లె మండలం, పుంగనూరు రూరల్ మండల టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుల నియామకం జరిగింది. మదనపల్లె టీడీపీ మండలాధ్యక్షుడు దేవరింటి శ్రీనివాస్‌ను చౌడేపల్లె మండలం పరిశీలకుడిగా నియమిస్తూ రాష్ట్ర అధక్షుడు పల్లాశ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు. పుంగనూరు రూరల్ మండల టీడీపీ ఎన్నికల పరిశీలకుడిగా రామసముద్రం మండలం చెంబకూరు పంచాయతీ బలిజపల్లె టీడీపీ నేత, రాజంపేట పార్లమెంట్ కమిటీ కోశాధికారి గజ్జల సీతప్ప నియమితులయ్యారు. శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో టీడీపీని బలోపేతం చేయడం, సంస్థాగత ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తామన్నారు. పుంగనూరు ఇన్‌చార్జి చల్లాబాబు, పలువురు అభినందించారు.

కేంద్ర పథకాలతో నిరుపేదలకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

తంబళ్లపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం 11 ఏళ్లగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలకు మేలు చేశాయని బీజేపీ మండలాధ్యక్షుడు వెంకట్రమణ అన్నారు. బీజేపీ రాష్ట్ర సహకార సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలన ఓ స్వర్ణయుగమన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అసెంబ్లీ కో కన్వీనర్ శంకర్‌రెడ్డి, హరినాథరెడ్డి, లక్ష్మీనారాయణ, యుగంధర్ రెడ్డి, వెంకట్రమణారెడ్డి, రామస్వామి, మల్లి పాల్గొన్నారు.

వేడుకగా మాతమ్మతల్లి జాతర

నిమ్మనపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ పెద్దమాదిగపల్లిలో బుధవారం రాత్రి మాతమ్మ తల్లి జాతర్లు గ్రావస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మేళతాళాలు, భాజాభంత్రీల మధ్య మహిళలు దీలు బోనాలు మోశారు. రాత్రి సమయంలో కోలాటలు, చెక్కభజనలు, పిల్లలగ్రోవి వంటి నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మాతమ్మతల్లికి తెల్లవారు జామున పొట్టేళ్లను ఆగారం ఇచ్చి పండగను వేడుకగా చేసుకున్నారు. గ్రామాల్లో గంగజాతర్లు జరుగుతుండంతో బంధుమిత్రులు, స్నేహితుల రాకపోకలతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు

మదనపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కరోనా కష్టకాలంలో మున్సిపాలిటీలో పనిచేసిన రోజువారి పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఐదునెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఇప్పటికే పలుమార్లు ఆందోళన చేపట్టినా, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వారు వాపోయారు. పట్టణంలో జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. అప్కాస్‌లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మిలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని వారు కోరారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ పథకాలు, తల్లికివందనం పథకాన్ని వర్తింపచేయాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బి.వి.రమణ, బి.మునుస్వామి నాయక్, గోపాల్, అరవింద్, రాజు, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీలో కష్టించిన వారందరికీ గుర్తింపు



టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమీక్షిస్తున్న పరిశీలకుడు రెడ్డప్ప

తంబళ్లపల్లె, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని టీడీపీ తంబళ్లపల్లె మండల పరిశీలకులు రెడ్డప్ప అన్నారు. అబ్జర్వర్ బృందం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తంబళ్లపల్లె-1, 2, గోపిదిన్నె, ఆర్‌ఎన్‌తండా, జుంజురపెంట, కొట్టాల గ్రామాల టీడీపీ సీనియర్ నేతలు, కార్యకర్తలతో సమీక్షించారు. ఇటీవల కొత్తగా ఎన్నికైన టీడీపీ గ్రామ కమిటీలపై ఆక్షేపణలు, నెలకొన్న సమస్యలను గ్రామాల వారీ నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల్లో పార్టీ శ్రేణులకు తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. పరిశీలన బృందం సభ్యులు రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు టీడీపీ రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో యోగాంధ్ర నిర్వహించాలి

పెద్దమండ్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలు, పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించాలని మండల శాఖల అధికారులు పిలుపు నిచ్చారు. బుధవారం మండల అధికారులు యోగాంధ్ర కార్యక్రమాలపై ప్రత్యేక సమావేశం జరిగింది. గురు, శుక్రవారం జరిగే యోగ కార్యక్రమాలకు ఆయా శాఖల అధికారులు, రిజిస్టర్ చేసుకున్న వారు ప్రతి ఒక్కరూ హజరవాలన్నారు. తహసీల్దార్ తేజశ్వి, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఎంఈఓ మనోహర్, డాక్టర్లు ఇమ్మానుయేల్, మహబూబ్‌బాషా, సీహెచ్ఓ క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఓ స్రవంతి బాధ్యతల స్వీకరణ



ములకలచెరువు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ శాఖ అధికారిగా స్రవంతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతి జిల్లా రామచంద్రాపురం ఏఓగా పనిచేస్తున్న ఆమెను ఇక్కడికి బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఏఓగా పనిచేస్తున్న లీలాకుమారిని పులిచెర్లకు బదిలీ చేశారు. దీంతో ఆమె బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా పాలేటమ్మ జాతర

గుర్రంకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎల్లుట్ల పాలేటమ్మ జాతరను బుధవారం ప్రజలు ఘనంగా చేసుకున్నారు. ఈ క్రమంలో అమ్మవారికి మహిళలు దీలు, బోనాలను తీసుకెళ్లి సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అమ్మవారికి మొక్కుగా భక్తులు రంగు రంగుల విద్యుత్ దీపాలతో చాందినీ బండ్లను కట్టారు. భక్తులు అమ్మవారికి కొబ్బరి కాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

తహసీల్దారుకు సన్మానం

పీలేరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పీలేరు తహసీల్దారు శివకుమార్‌ను బుధవారం అఖిల భారత మాల సంఘాల జేఏసీ నేతలు సన్మానించారు. పీలేరు మండలంలో పేరుకుపోయిన దళితుల భూసమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా జేఏసీ నేతలు గుర్రం నారాయణ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలు రామాంజులు, వెంకటరమణ, రామచంద్రయ్య, లోకనాథం, సురేంద్ర, నాగయ్య, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ నేతలపై దాడి సరికాదు

మదనపల్లె టౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ప్రైవేటు విద్యాసంస్థల వద్ద నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నేతలపై పోలీసులు దాడి చేయడం సరికాదని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్ విమర్శించారు. ఆర్థిక భారంతో కొట్టుమిట్టాడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు మద్దతుగా తాము పోరాడుతుంటే విద్యార్థి సంఘాల నేతలపై దాడి చేయించడం సిగ్గుచేటన్నారు. ఇది ముమ్మాటికీ ఉద్యమాలను అణగదొక్కే చర్యే అన్నారు. పోలీసుల లాఠీలు, తూటాలు విద్యార్థుల ఉద్యమాలను ఆపలేవని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని ఆయన ఒక ప్రకటనలో హెచ్చరించారు.

నేడు స్కూల్ కిట్స్ పంపిణీ

కలికిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జ్యోతిబా ఫూలే బాలికల గురుకుల పాఠశాలలో గురువారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి విద్యార్థినులకు స్కూల్ కిట్స్ పంపిణీ చేయనున్నారు. ఉదయం 10 గంటలకు పాఠశాలలో జరిగే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరు కానున్నారు. దాదాపు ఐదు వందల మంది విద్యార్థినులకు కిట్స్‌ను ఆయన అందజేయనున్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దమండ్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): బండమీదపల్లి పంచాయతీ తురకపల్లి వద్ద పేకాట స్థావరంపై ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు దాడులు చేశారు. పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.11,850 నగదు, ఐదు సెల్‌ఫోన్‌లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ వెంటేశ్వర్లు వెల్లడించారు. ఎస్ఐ మాట్లాడుతూ పేకాట ఆడడం, ఆడించడం, నాటు సార అమ్మడం, తయారీలు చేయడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో చిన్నచిన్న గొడవలు పెద్దవిగా చేస్తే కఠిన చర్యలు చేపడతామన్నారు. అపరిచితుల సంచారం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. జాఫర్‌ఖాన్, కృష్ణమూర్తి, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

పీలేరు రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని కేవీపల్లె ఎంఈఓ రెడ్డిబాషా తెలిపారు. కేవీపల్లె మండలం జీకొత్తపల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రి దాతలు అందించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నారని చెప్పారు. జీ కొత్తపల్లె ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు ఎంపీటీసీ సూర్యనారాయణ రెడ్డి, యల్లారెడ్డి సొంత నిధులతో విద్యాసామగ్రి అందించారు. సీఆర్‌సీ ప్రధానోపాధ్యాయిని సరస్వతి, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.